01ATP15F.qxd:01ATP15F.qxd 16/06/26 11:30 PM Page 1




అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

మంగళవారం 16 జూన్ 2026 | పేజీలు : 04


# రైతు సంక్షేమమే ఎన్డీఏ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం..!

❖ రైతులకు రాయితీ వేరుశనగ విత్తనాల కేటాయింపు
❖ పోతులనాగేపల్లిలో పంపిణీ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్య కుమార్ యాదవ్



రైతులకు వేరుశనగ కాయలు పంపిణీ చేస్తున్న మంత్రి

**ధర్మవరం రూరల్ జూన్ 15 ప్రభాతవార్త**

రైతు సంక్షేమమే ఎన్డీఏ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ అన్నారు. ధర్మవరం మండలం పోతులనాగేపల్లిలో సోమవారం ఖరీఫ్2026 సీజన్‌కు సంబంధించిన సబ్సిడీ వేరుశనగ విత్తనాలు, ఉచిత కందులు, పచ్చి ఎరువుల విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, శ్రీ సత్యసాయి జిల్లాకు కేటాయించిన 72,289 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాల్లో ధర్మవరం నియోజకవర్గానికే 12,928 క్వింటాళ్లు కేటాయించడం రైతుల పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. విత్తనాలను 40 శాతం సబ్సిడీపై అందిస్తున్నట్లు తెలిపారు. రైతుల ఆదాయం పెంపునకు నాణ్యమైన విత్తనాలు, ఆధునిక సాగు పద్ధతులు, సరైన మార్కెటింగ్ కీలకమని పేర్కొన్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలు, సేంద్రీయ వ్యవసాయం వైపు దృష్టి సారించాలని సూచించారు. ఎఫ్‌పీఓల ద్వారా రైతులు సంఘటితమైతే ఉత్పత్తి, నిల్వ, మార్కెటింగ్ రంగాల్లో మరింత ప్రయోజనం పొందగలరని తెలిపారు. ధర్మవరం నియోజకవర్గంలో రహదారులు, నీటి సంరక్షణ, వ్యవసాయ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి చెప్పారు. ఎన్నికల హామీలను అమలు చేస్తూ రైతులు, మహిళలు, పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, డీఏవో నారాయణ నాయక్, తసిల్దార్ దేవరాజు, ఎంపీడీవో లలిత, ఏడీఏ లక్ష్మ నాయక్, ఏంఏవో ముస్తఫా, అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ అరుణ శ్రీ, ఏపీ సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ కాటమయ్య, బిజెపి రూరల్ అధ్యక్షులు గొట్లూరు చంద్ర, మాజీ ఎంపీపీ మద్దిలేటి తదితర ఎన్డీఏ కూటమి నాయకులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# అంతర్గత కుమ్ములాటలతో వైసిపి నేతలు







❖ కూటమి నేతల తప్పులను ఎత్తి చూపేందుకు నియోజకవర్గాల్లో ఆందోళనలు ఏవీ..!
❖ హాంద్రీనీవా లైనింగ్ పనుల్లో అవినీతి జరిగిన వైసిపి నేతలు ఎందుకు స్పందించ లేదు
❖ టిడిపి నేతలు మద్యం అధిక రేట్లకు అమ్ముతున్నా.. బెల్టు షాపులు పెట్టినా ప్రశ్నించింది ఎక్కడ..?
❖ వైసిపి నేతలు ఒకరినొకరు వెనక్కు నెట్టేసుకునేందుకే ప్రయత్నాలు
❖ రెండేళ్ల కూటమి పాలనలో వైసిపి నేతల తీరు ఇదండీ..!

**అనంతపురం, జూన్ 15 ప్రభాతవార్త బ్యూరో**

టిడిపి, జనసేన, బిజెపి ఒక జట్టు కట్టి గత ఎన్నికల రణరంగంలో నిలవడంతో అప్పుడున్న పరిస్థితుల వల్ల ఎన్నికల ఫలితాలు సునామీలా వచ్చి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైసిపి 11 స్థానాలకే పరిమితమైంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒక్క అసెంబ్లీ సీటుగానీ గెలుచుకోలేక పోయారు. 14 శాసన సభ స్థానాల్లో రెండు లోక్ సభ స్థానాల్లో వైసిపి అభ్యర్థులందరూ ఓడిపోయినా కూటమి ప్రభుత్వం వచ్చి రెండేళ్లు అయినా వైసిపి నేతల్లో మార్పు రావడం లేదు. రాబోయే ఎన్నికల్లో ఎట్లా సీట్లు తెచ్చు కోవాలని ఆలోచిస్తున్నారే తప్పా పార్టీ బలోపేతం విషయంలో గానీ, కార్యకర్తలకు అండగా నిలిచే విషయంలోగానీ, పలు నియోజకవర్గాల్లో వైసిపి నేతలు తగిన రీతిలో స్పందించడం లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో వైసిపి నాయకులు అంతర్గత విబేదాలతో కొట్టుమిట్లాడుతూనే ఉన్నారు. ఎన్నికల గుణపాఠాలను నేర్చుకోకుండా ఒక నాయకున్ని ఏ విధంగా మరొకరు వెనక్కి లాగే పరిస్థితులు మెజార్టీ నియోజకవర్గాల్లో ఉన్నాయి. బయటికి కలిసి కట్టుగా ఉన్నట్టుగా నటించినా వారిలో విబేదాలు తగ్గిపోలేదు. నేతల తీరును చూసి వైసిపి క్రియా శీల కార్యకర్తలు అసహించుకుంటున్నారు. వీళ్లెప్పుడుమారుతారు రా బాబూ అంటూ కార్యకర్తలు ఆక్రోశం వెల్లగక్కుతున్నారు. జిల్లాలో మెజార్టీ నియోజకవర్గాల్లో ఇష్టాను సారం మద్యం అమ్మకాలు, మద్యం రేట్లు పెంచడం, బెల్టు షాపు నిర్వహించడం ఇలాంటి చర్యలు జరుగుతూనే ఉన్నాయి. కొన్ని చోట్ల ఇసుక, మట్టి లాంటివి కూడా అక్రమంగా తరలిస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ఉపాధిహామీ పథకం కింద ఫీల్డ్ అసిస్టెంట్లు దోచుకుంటున్నారు. ఈ విధంగా పలు అవినీతి అక్రమాలను కూటమి నేతలు చేస్తున్నా నియోజకవర్గాల్లో కొంతరు సమన్వయ కర్తలు సరీగా స్పందించడం లేదని వైసిపి కార్యకర్తలే చెబుతున్నార. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద లైనింగ్ పనుల్లో అవినీతి జరిగినా, లైనింగ్ పనుల వల్ల ప్రధాన కాలువకు అటు ఇటు స్థానిక రైతులకు ఇబ్బంది కలిగినా వారికి అండగా నిలబడేందుకు వైసిపి నేతలు తగిన రీతిలో యత్నించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అనంతపురం జిల్లాలో వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి నేతృత్వంలో ప్రజా సమస్యలపై పలు సందర్భాల్లో స్పందిస్తూ వస్తున్నారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టడంతోపాటు స్థానిక సమస్యలపై కూటమి నేతల వవ్యవహార శైలిని గట్టిగా తప్పు బడుతూ వచ్చారు. తాడిపత్రిలోకి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని రాకుండా చేసేందుకు అడ్డుకుంటున్న చర్యలపై గట్టిప్రయత్నమే చేశారు. ఇదే సమయంలో శ్రీ సత్యసాయి జిల్లా వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషాశ్రీ చరణ్ తగిన రీతిలో స్పందించడం లేదన్న అభిప్రాయం ఉంది. పార్టీ పిలుపు ఇచ్చినప్పుడు కార్యక్రమాలు చేయడం మినహా ఇతర నియోజకవర్గ సమన్వయ కర్తలను కలుపుకుని ఉషాశ్రీ చరణ్ ఆందోళనలు చేయడం లేదని పార్టీ బలోపేతానికి చర్యలు తీసు కోవడం లేదన్న అభిప్రాయం ఉంది. పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్తలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వై.విశ్వేశ్వర్‌రెడ్డి, తలారి రంగయ్య లాంటి కొందరు వారివారి నియోజకవర్గ సమస్యలపై స్పందిస్తున్నా ఎక్కువ నియోజకవర్గాల సమన్వయ కర్తలు తగిన రీతిలో స్పందించడం లేదని విబేధాలతోనే కొట్టుమిట్లాడుతున్నారని, కొందరు పేరుకు మాత్రమే నియోజకవర్గాలకు వస్తున్నారని అభిప్రాయం వుంది. అధికార పక్షంపై ప్రజల్లో ఉన్న అసహనం, వ్యతిరేకతను తన ఖాతాలో వేసుకోవాలంటే పార్టీ ఐక్యంగా పటిష్టంగా ఉండాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా హంద్రీనీవా విషయమే కాకుండా రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని కూటమి ప్రభుత్వం నిలిపివేసిందని, ప్రజల్లో ఉద్యమం చేసేందుకు వైసిపి నిర్ధిష్టమైన కార్యచరణ లేకపోవడం వల్లే ఆ నిరసన ముందుకు పోవడం లేదన్నారు. ముఖ్యంగా 2029లో సీటు ఎలా సాధించాలన్న పావులు కదుపుతున్నారు తప్పా అప్పటికి పార్టీని విజయం వైపు నడిపించాలంటే తగిన చర్యలు తీసుకునేందుకు వైసిపి నేతలు స్పందించడం లేదని విమర్శలు ఉన్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో శాసనసభ నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే ఇప్పటికీ పార్టీ బలోపేతం కాకపోగా అంతర్గత గ్రూపు రాజకీయాలతో సతమతమవు తున్నారు. నియోజకవర్గాల వారీగా వైసిపి నేతల పరిస్థితిని పరిశీలిస్తే, అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో వైఎసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి వర్సెస్ కొగటం విజయభాస్కర్‌రెడ్డి, నదీం, మహాలక్ష్మిశ్రీనివాసులు,

మిగతా 3లో..

# అంతర్జాతీయ ఫుట్‌బాల్ టీంకు గుత్తి విద్యార్థి ఎంపిక



విద్యార్థి కార్తీక్ (ఫైల్‌ఫోటో)

**గుత్తి, జూన్ 15 ప్రభాతవార్త**

గుత్తి పట్టణంలోని కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న కార్తీక్ అనే విద్యార్థి , అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడా పోటీలకు ఎంపికయ్యాడు. స్థానిక మున్సిపాలిటీలో డ్రైవర్‌గా పనిచేస్తున్న సుగుణ కుమారుడు కార్తీక్, ఆర్డీటి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో ఎంపికయ్యాడు. తదుపరి విజయవాడలో టాటా స్పోర్ట్స్ అకాడమీ జంషెడ్పూర్ క్రీడా జట్టుకు ఎంపికయ్యాడు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం సుబహాన్, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని ఘనంగా సత్కరించారు. విద్యార్థి ఎంపిక పట్ల ఫుట్‌బాల్ కోచ్‌లు దాదా, ప్రసాద్, శీనాలు హార్షం వ్యక్తం చేశారు.

యోగాను జీవన విధానంగా మార్చుకోవాలి..! 4>>

# జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్



కౌన్సిల్ సమావేశంలో అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

**శ్రీ సత్యసాయి జిల్లా, జూన్ 15, ప్రభాతవార్త ప్రతినిధి**

ప్రభుత్వ ఉత్తర్వులు జి ఓ 1032 మేరకు సోమవారం శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అధ్యక్షతన గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలతో సోమవారంఖిజాయింట్ స్టాఫ్ కౌన్సిల్ఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు పలు కీలక సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగులకు రావాల్సిన డీఏ, బకాయిల విడుదల, కొత్త పీఆర్‌సీ ఏర్పాటు, ఐఆర్ ప్రకటన, ఖాళీగా ఉన్న పోస్టుల సకాలంలో భర్తీ చేయాలని కోరారు. అలాగే, ఆర్టీసీ బస్ స్టాండ్లలో నెలకొన్న సమస్యలు,"స్త్రీ శక్తి" పథకం ద్వారా ఆర్టీసీ సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పాఠశాలల్లో తెలుగు, హిందీ పండిట్ల కొరత తీర్చడం, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచడంపై చర్చించారు. రెవెన్యూ శాఖలో డీటీ ప్రమోషన్లు, వీఆర్‌ఏల నుంచి వాచ్‌మెన్ లేదా ఆఫీస్ సబోర్డినేట్లుగా పదోన్నతులు కల్పించాలని, కార్యాలయాల నిర్వహణకు స్టేషనరీ బడ్జెట్ కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ మైనుద్దీన్, జనరల్ సెక్రటరీ జి.వై.పి. రావు, ఏపీఎన్ జీజీఓ ఎస్ అధ్యక్షులు లింగా రామ్‌మోహన్, ఇతర ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# డిఎస్సీ నియామకాలపై వైసిపిది విష ప్రచారం

\- బిజెపి నేత విష్ణు వర్ధన్‌రెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి నేత విష్ణు వర్ధన్‌రెడ్డి

**అనంతపురం సిటీ, జూన్ 15 ప్రభాతవార్త**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహించిన డిఎస్సీపై వైసిపి విష ప్రచారం చేస్తోందని బిజెపి సీనియర్‌నేత, కేంద్ర యువజన మంత్రిత్వ శాఖ జాతీయ వైస్ చైర్మన్ విష్ణు వర్ధన్‌రెడ్డి విమర్శించారు. నగరంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్, రాష్ట్ర సెల్స్ కన్వీనర్ కనంపల్లి చిరంజీవిరెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు అంకాల రెడ్డి, మీడియా అధికార ప్రతినిధి వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లాప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డితో కలిసి ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 16,347 ఉపాధ్యాయ పోస్టుల నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. అయితే నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దానిని అడ్డుకునేందుకు అనేక కేసులను వేయించారన్నారు. అయినప్పటికీ వీటిని అధిగమించి డిఎస్సీ నియామకాలు చేపడితే పోస్ట్ కోటా పేరిట అక్రమాలు జరిగాయంటూ అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడం వైసిపికి ఇష్టం లేదని ఆయన మండి పడ్డారు. ఇప్పటికైనా వైసిపి తన వైఖరిని మార్చుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు సూర్యప్రకాష్, నాగేంద్ర, చంటి, చక్రధర్ యాదవ్, దామోదర్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాల సరఫరాయే ప్రభుత్వ లక్ష్యం

జిల్లాలో కళ్యాణదుర్గం నుంచే విత్తన పంపిణీ ప్రారంభం : ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

రైతు క్షేమంతోనే రాష్ట్రం సుభిక్షం జూన్ 20న రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ నగదు జమ



మహిళా రైతులకు రాయితీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు



సబ్సిడీ కంది విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

**కళ్యాణదుర్గం, జూన్ 15 ప్రభాతవార్త**

రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. ఖరీఫ్2026 సీజన్‌కు సంబంధించి రాయితీ వేరుశనగ, కంది మరియు చిరుధాన్యాల విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం కళ్యాణ దుర్గం ప్రజావేదికలో ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి సాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బోయ లక్ష్మీదేవి రమేష్, సీనియర్ నాయకులు చౌలం మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని కళ్యాణదుర్గం నుంచే ప్రారంభించడం విశేషమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో సుమారు ఐదువేల మంది రైతులు విత్తనాల కోసం నమోదు చేసుకున్నారని, ప్రస్తుతం 2,200 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు అందు బాటులో ఉన్నాయని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలను సద్వినియోగం చేసుకుని రైతులు సాగు పనులను ప్రారంభించాలని సూచించా రు. త్వరలో రైతులకు ట్రాక్టర్లు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు, స్ప్రింక్లర్లు వంటి వ్యవసాయ ఉపకరణాలను అంద జేస్తామని చెప్పారు. అలాగే ఈ నెల 20న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో, రైతులు తక్కువ నీటితో పండే కంది, సజ్జ, జొన్న, కొర్ర వంటి చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. సమృద్ధిగా వర్షాలు కురిసి నియోజకవర్గంలోని చెరువులు నిండాలని ఆకాంక్షించారు. హార్టికల్చర్ నిధులతో సాగునీటి ప్రాజెక్టుల పూర్తి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. బీటీపీ ప్రాజెక్టును 2028 నాటికి పూర్తి చేయడానికి చర్యలు కొనసాగు తున్నాయని చెప్పారు. కుందుర్పి మండలం జంబుగుంపుల వద్ద సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. రైతులకు అవసరమైన ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించేందుకు ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్‌ను వినియోగి స్తున్నామని, యూరియా, డీఏపీ వంటి ఎరువులను శాస్త్రీయ పద్ధతుల్లో వాడేలా రైతులకు మార్గనిర్దేశం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తాడిపత్రిలో పొలిటికల్ హీట్

❖ రంగంలోకి దిగిన మంత్రి టీజీ భరత్
❖ ప్రభుత్వ పెద్దల స్పష్టమైన హామీతో ఎస్‌పి గ్రీవెన్స్ కార్యక్రమం తాత్కాలిక వాయిదా



మంత్రి టిజి భరత్‌తో మాట్లాడుతున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి

**తాడిపత్రిఅర్బన్, జూన్ 15 ప్రభాతవార్త**

అనంతపురం జిల్లా తాడిపత్రిలో మరోమారు పొలిటికల్ హీట్ చెలరేగింది. రెండు రోజుల క్రితం టిడిపి విజయోత్సవ బైక్ ర్యాలీ ఏర్పాటు చేయడానికి సిద్ధం కాగా వైఎస్‌ఆర్‌సిపి ఆధ్వర్యంలో చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్ల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమానికి పిలుపు ఇవ్వడంతో తాడిపత్రిలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమానికి సిద్ధమయ్యారు. ఇరు పార్టీల నేతలు ఒకేసారి కార్యక్రమాలు చేపట్టడంతో పోలీసులు అనుమతి నిరాకరించి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని అరెస్టు చేసి అనంతపురంకు తరలించారు. టిడిపికి చెందిన మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డి పోలీసులు వైఎస్‌ఆర్‌సిపి నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని తాడిపత్రిలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా దాదాపు 6 గంటల పాటు మంచం వేసుకొని నిరసన వ్యక్తం చేసి స్నానం చేయడం జరిగింది. పెద్దారెడ్డి తమ కార్యకర్తలపై తమపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆయనపై కేసు నమోదు చేయాలని పట్టు పట్టడంతో పోలీసులు కేసు నమోదు చేసి ఎఫ్‌ఐఆర్ కాపీని జె.సి ప్రభాకర్‌రెడ్డికి అందజేయడంతో నిరసన విరమించి సోమవారం పెద్దారెడ్డి బాధితులతో కలిసి అనంతపురం కేంద్రంలో జిల్లా ఎస్‌పి కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమంలో వినతిపత్రం అందజేస్తామని పిలుపునిచ్చారు. దాదాపు 100 వాహనాలతో టిడిపి నాయకులు కార్యకర్తలు వెళ్లడానికి సిద్ధం కాగా ప్రభుత్వ పెద్దలు రంగంలోకి దిగారు. అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్, టిడిపి జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు జె.సి ప్రభాకర్‌రెడ్డి నివాసానికి వెళ్లి జె.సి ప్రభాకర్‌రెడ్డితో చర్చలు జరిపారు. వైఎస్‌ఆర్‌సిపి ప్రభుత్వంలో టిడిపి నాయకులు, కార్యకర్తలపై జరిగిన దాడులు అక్రమ కేసుల గురించి చర్చించారు. అధికారంలో ఉన్న కేతిరెడ్డి పెద్దారెడ్డికి పోలీసులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని వారి దృష్టికి జె.సి ప్రభాకర్‌రెడ్డి తీసుకొచ్చారు. ఎన్నికల ఘర్షణలో చాలామంది టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఘర్షణకు సంబంధం లేకున్నా రౌడీ షీట్లు తెరిచారని వాటిని మూసివేయాల్సిందిగా కోరారు. జిల్లాలో వైఎస్‌ఆర్‌సిపి నాయకులు టిడిపి వారిపై చేస్తున్న దాడులు దౌర్జన్యాలపై చర్చించారు. జె.సి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్న అంశాలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేగా చర్యలు తీసుకుంటామని మంత్రి టీజీ భరత్ స్పష్టమైన హామీ ఇవ్వడంతో జె.సి ప్రభాకర్‌రెడ్డి అనంతపురం పర్యటన రద్దు చేసుకున్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వంపై జె.సి ప్రభాకర్‌రెడ్డి ధిక్కారస్వరం పెంచడంతో ఆయనను శాంతింప చేయడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపడుతుందోనని మేధావులు భావిస్తున్నారు. తాడిపత్రి ప్రజల కోసం తాను పార్టీ, ప్రభుత్వ విధానాలు లెక్కచేయని తాడిపత్రి ప్రజల కోసం తాను ఎంత దూరం అయిన వెళతానని జె.సి ప్రభాకర్‌రెడ్డి ప్రకటించడం కొసమెరుపు.

# సోషల్ వెల్ఫేర్ డీడీ నియామకంపై నిర్లక్ష్యం..!

❖ గత ఏడాది ఫిబ్రవరి నుండి రెగ్యులర్ డీడీ లేని వైనం
❖ రెగ్యులర్ డీడీ లేక తగ్గుతున్న ఫలితాలు
❖ అప్పటినుండి ఇన్చార్జిలతోనే నెట్టుకొస్తున్న పరిస్థితి
❖ ప్రారంభమైన నూతన విద్యా సంవత్సరం





**అనంతపురం న్యూటౌన్, జూన్ 15 ప్రభాతవార్త**

గత ఏడాది నుండి సోషల్ వెల్ఫేర్ కు రెగ్యులర్ డీడీ లేరు. అప్పటినుండి ఇన్చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. దీని ఫలితంగా పదవ తరగతి ,ఇంటర్మీడియట్ ఫలితాల ఉత్తీర్ణత శాతం కూడా తగ్గింది. ఈ విషయం ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులకు తెలిసినప్పటికీ కూడా రెగ్యులర్ డీడీ నియామకంపై పట్టించుకోకపోవడం గమనార్హం. అనంతపురం జిల్లా సోషల్ వెల్ఫేర్ రెగ్యులర్ డీడీగా గతంలో ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి పనిచేస్తుండేవారు. ఆయన కొన్ని నెలలకే డిప్యూటేషన్ పై బదిలీ అయ్యారు. గత ఏడాది ఫిబ్రవరి 16వ తేదీన రిలీవ్ అయ్యారు. అదేరోజు అప్పటి గుత్తి అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాధిక ఇన్ ఛార్జ్ డీడీ గా బాధ్యతలు స్వీకరించారు. ఆ అధికారిణి కు జిల్లా అధికారిగా పదోన్నతి పై మరొక జిల్లాకు బదిలీ కావడంతో గత ఏడాది మే 1న రిలీవ్ అయ్యారు. అప్పుడు ఇంచార్జ్ డీడీ బాధ్యతలను బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి కి జిల్లా కలెక్టర్ అప్పగించారు. కొన్ని రోజులకు అనంతపురం, ఉరవకొండ, గుత్తి డివిజన్ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టల్ కూడా ఖాళీ ఏర్పడ్డాయి. అయితే కొన్ని రోజులకు ఆ డీడీ కి పని ఒత్తిడి పెరగడంతో ఇటు సొంత శాఖను, అటు ఇంచార్జ్ శాఖను సరిగ్గా పర్యవేక్షణ చేయలేకపోయారు. దీంతో తనకు సోషల్ వెల్ఫేర్ ఇంచార్జ్ డీడీ బాధ్యతలు తొలగించాలని జిల్లా కలెక్టర్ కు పలమార్లు లెటర్ పెట్టుకోవడం జరిగింది. అందుకు జిల్లా కలెక్టర్ ఒప్పుకోలేదు. దీంతో ఆ డీడీ అలాగే కొనసాగుతూ అయిష్టంగా పనిచేస్తూ వచ్చారు. దీని ఫలితంగా తాజాగా విడుదలైన పదవ తరగతి ,ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు ఉత్తీర్ణత శాతం కూడా గత ఏడాది కంటే ఈసారి చాలా తగ్గింది. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న తరుణంలో ఆ డీడీ తనకు ఇన్చార్జ్ బాధ్యతలు తొలగించాలని మరొకసారి కలెక్టర్ కు లెటర్ పెట్టడం జరిగింది. దీంతో కలెక్టర్ ఇన్ ఛార్జ్ డీడీ బాధ్యతలను గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు కు అప్పగించడంతో ఆయన గత వారంలో బాధ్యతలు స్వీకరించారు. ఇలా గత ఏడాది ఫిబ్రవరి 16 నుండి ఇన్చార్జిలతోనే జిల్లాలో పాలనను కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైంది. ఇప్పటికీ కూడా రెగ్యులర్ డీడీ ను నియామించుకోకుండా ఉన్నతాధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. అన్ని సంక్షేమ శాఖలకు సాంఘిక సంక్షేమ శాఖ నోడల్ శాఖ. అలాంటి శాఖకే రెగ్యులర్ డీడీ ను నియమించకపోవడన్ని తప్పుపడుతున్నారు. కనీసం ఇప్పటికైనా ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వీడి వెంటనే రెగ్యులర్ డీడీ ను నియమించాలని ఇటు విద్యార్థి సంఘాలతో పాటు ప్రజా సంఘాల నాయకులు, జిల్లా ప్రజలు కోరుతున్నారు. అయితే దీనిపైన రాష్ట్ర ఉన్నతాధికారులు స్పందిస్తారా? లేదా? అన్నవి వేచి చూడాల్సిందే.

# శృంగేరి పీఠాధిపతులకు ఆహ్వానం



స్వామీజీలకు ఆహ్వానం పలుకుతున్న బి,ఎస్ బ్రదర్స్

**హిందూపురం జూన్ 15 ప్రభాతవార్త**

దక్షిణామ్నాయ శృంగేరి శ్రీ శారదా పీఠాధిపతులు అనంత విభూషత జగద్గురువులు శ్రీ శ్రీ భారతి తీర్థ మహాస్వామి, శ్రీ శ్రీ విదుర శేఖర భారతి మహాస్వామి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన లేపాక్షి పుణ్యక్షేత్రానికి సోమవారం హిందూపురం పట్టణానికి చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ బి,ఎస్ విద్యాసాగర్, ప్రముఖ వ్యాపారవేత్త బి,ఎస్ విశ్వనాథులు స్వామీజీలను కలిసి ఆహ్వానించారు. బిఎస్ బ్రదర్స్ ఆహ్వానం మేరకు లేపాక్షి ఆలయాన్ని తప్పకుండా సందర్శిస్తామని గురువులు తెలిపినట్లు వారు తెలిపారు. అందరూ కలిసి సనాతన ధర్మాన్ని పరిరక్షించడానికి కృషి చేయాలని ఈ సందర్భంగా స్వామీజీలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మీనరసింహ, పురోహితులు అనంతరామ శర్మ, రత్నగిరి నాగేష్, సేవ మందిరం సతీష్, సందీప్ కుమార్ శర్మ, మంజునాథ్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

# రాగుల కొనుగోలు కేంద్రం పరిశీలన



రాగుల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**హిందూపురం టౌన్ జూన్ 15 ప్రభాతవార్త**

హిందూపురం మండలం మలుగూరు గ్రామంలోని రాగుల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం సివిల్ సప్లై మేనేజర్ రాజు నాయక్, జిల్లా కోపరేటివ్ అధికారి కృష్ణ నాయక్, హిందూపురం సహాయ వ్యవసాయ సంచాలకులు కృష్ణయ్యలు పరిశీలించినట్లు హిందూపురం మండల వ్యవసాయ అధికారి సురేంద్రనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 970 ఎకరాలలో రాగి పంట గత రవి సీజన్లో సాగు చేయడం జరిగిందని, ఇప్పటివరకు దాదాపు 1500 కుంటాల రాగులు కొనుగోలు చేయడం జరిగిందని అన్నారు. గ్రామస్థాయి వ్యవసాయ అధికారులు పంట నమోదు తనిఖీ చేసుకొని షెడ్యూల్ ప్రకారం రైతులకు ముందస్తు సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కోఆపరేటివ్ చైర్మన్ శంకరప్ప, సీఈఓ రామకృష్ణారెడ్డి, నవీన్, సుబ్బన్న, దీపారాణి, రైతులుపాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి అందించి ఆదుకోండి ఎమ్మెల్యే కాలువకు వినతి



ఆర్థిక సాయం అందించాలని ఎమ్మెల్యేకి వినతి

**కనేకల్లు జూన్ 15 ప్రభాతవార్త**

కనేకల్ మండల పరిధిలోని హనకన హాళ్ గ్రామానికి చెందిన కురుబ వాదే సురేష్ ఆటోయాక్సి డెంట్ లో ఎడమచె య్యికి రెండుసార్లు ఆపరేషన్ చేయడంతో 2.08. 494 రూపా యలు ఖర్చు అయ్యిందని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని రాయదుర్గం శాసనసభ్యులు కాల్వ శ్రీనివాసులకు విన్నవించాడు. రాష్ట్ర కురుబ సంఘం అధ్యక్షులు ఎస్.కె మల్లికార్జున కనేకల్ రూరల్ సొసైటీ బ్యాంక్ చైర్మన్ వాల్మీకి నాగార్జున సూచనలు మేరకు రాయదుర్గం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్పు కాలువ శ్రీనివాసులు ని కలిసి వారికి ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు చేయాలని విన్నవించారు ఈ కార్యక్రమంలో వాల్మీకి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ అధినేతకు బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కృతజ్ఞతలు : ఆలూరు చిక్కన్న

**కనేకల్ జూన్ 15 ప్రభాతవార్త**



మెట్టును సన్మానిస్తున్న వైసీపీ బీసీ సెల్ కార్యదర్శి చిక్కన్న

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు వైసిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డికి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డికి రాయదుర్గం వైసీపీ సమన్వయకర్త మెట్టు గోవింద్ రెడ్డికి ఆలూరు చిక్కన్న ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. రాయదుర్గం సమన్వయ కర్త మెట్టు గోవింద్ రెడ్డి కార్యాలయం నందు ఆయన్ని మర్యాదపూర్కు అందరు కలిసి శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నూతన రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి ఆలూరు చిక్కన్న మాట్లాడుతూ నా రాజకీయ చరిత్రలో కాంగ్రెస్ పార్టీలోనూ వైఎస్ఆర్ పార్టీ లోను 40, సంవత్సరాల సుదీర్ఘ పయనంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఏకధాటిగా 14 సంవత్సరాలపాటు మండల కన్వీనర్ గా పని చేశానని తెలిపారు. నా రాజకీయ జీవితం కాంగ్రెస్ పార్టీతో మొదలై 14 ఏళ్ల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ పార్టీకి సేవలు అందించినందుకు గాను నా సేవలను అధిష్టానం గుర్తించి మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఆదేశాల మేరకు నా మీద నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించారని తెలిపారు. పార్టీలో చురుకుగా పాల్గొని పార్టీ బలోపేతానికి నా సాయి శక్తుల కృషి చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# నివాళులర్పించి సంతాపం తెలిపిన వాల్మీకి సంఘం అధ్యక్షులు

**డి.హిరేహాళ్ జూన్ 15 ప్రభాతవార్త**



చిన్న తిప్పమ్మ(65)భౌతిక కాయంకు నివాళులర్పిస్తున్న వాల్మీకి సంఘం అధ్యక్షులు

రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు నాయకుల బండి క్రిష్టప్పచిన్నతిప్పమ్మ (65) భౌతిక కాయంకు పూలమాలవేసి నివాళులర్పించి సంతాపం వెలిబుచ్చారు. సోమవారం రాయదుర్గం పట్టణంలోని కోట ప్రాంతం మారెమ్మ దేవాలయం సమీపంలోని నాయకుల ఆంజనేయులు సతీమణి గుండెపోటుతో మృతి చెందారు. ఈ సమాచారం అందుకున్న వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు ఆ సేవాసమితి ఉపాధ్యక్షులు మలకన్న, సహాయ కోశాధికారి పై తోట రఘు, ప్రధాన సలహాదారులు తలారి రాజప్ప, మిత్రులతో కలిసి మృతురాలి స్వగృహం కు చేరుకొని నివాళులర్పించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం మృతురాలు భర్త, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ఆత్మస్థైర్యం కోల్పోకుండా ముందుకు జీవనం సాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మీడియా సలహాదారులు బోయపాటి ప్రకాష్, సభ్యులు అజయ్ టైలర్ రఘు, పై తోట ముత్తయ్య, పై తోట శ్రీనివాసులు, తిప్పేస్వామి, మిత్రులు న్యాయవాదులు సూర్యజాన్సన్, రఘునాయక్, సిద్దేశ్వర పైగేరి హమాలి యూనియన్ అధ్యక్షుడు కురుబ గురుమాల్ శ్రీనివాసులు, విశ్రాంతి ఉద్యోగి గొల్ల గోపాల్, చిరు వ్యాపారి గాజుల భీమరాజులు తదితరులు పాల్గొన్నారు.

# చెరువు మునకలో పట్టాలు ఇవ్వడం అన్యాయం

-పోస్టుల ద్వారా పట్టాలు పంపడం దుర్మార్గం

-ఇళ్లు కట్టుకున్న చోటే పట్టాలు ఇవ్వాలని సిపిఎం డిమాండ్

-హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని

సుందరయ్యకాలనీవాసుల ఆందోళన



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కాలనీవాసులు

**చిలమత్తూరు, జూన్ 15 ప్రభాతవార్త**

ఏళ్ల తరబడి కాయకష్టం చేసి, అప్పులు చేసి, బంగారం కుదువ పెట్టి రోడ్లు, తాగునీరు తదితర మౌలిక వసతులు సమకూర్చుకుని ఇళ్ల నిర్మించుకున్న తమకు అదే ప్రాంతంలో ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ మండలంలోని కొడికొండ చెక్‌పోస్ట్ సమీపంలోని సిపిఎం సుందరయ్యకాలనీవాసులు సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. తాము నివసిస్తున్న ప్రాంతాన్ని పక్కనపెట్టి వేరే ప్రాంతాల్లో స్థలాలు కేటాయిస్తూ పోస్టు ద్వారా పట్టాలు పంపించడం అన్యాయమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు ఫిరంగి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కోడూరు పొలం సర్వే నెంబర్లు 805, 805-6, 805-7లో దాదాపు 254 మంది ఇళ్ల లేని పేదలు ఐదేళ్లుగా గుడిసెలు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారన్నారు.. 2023లో లబ్ధిదారులతో కలిసి హైకోర్టును ఆశ్రయించగా, 2024లో వారు నివసిస్తున్న ప్రదేశంలోనే ఆరు నెలల్లో ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోర్టు ఆదేశించిందన్నారు. అయినప్పటికీ అధికారులు హైకోర్టు ఆదేశాలను అమలు చేయకుండా వేరే ప్రాంతాలను చూపిస్తూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసి ఈ నెల 23న విచారణకు సిద్ధమవుతుండగా, దురుద్దేశపూర్వకంగానే పోస్టు ద్వారా పట్టాలు పంపించారని ఆరోపించారు. సాధారణంగా పట్టాల పంపిణీ కార్యక్రమాలు ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో నిర్వహిస్తారని, పోస్టు ద్వారా పట్టాలు పంపించడం వెనుక అధికారుల ఉద్దేశ్యంపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఐదేళ్లుగా అక్కడ నివసిస్తున్న పేదల సమస్యలను తెలుసుకోవడానికి ఒక్కసారి కూడా అధికారులు కాలనీని సందర్శించలేదని మండిపడ్డారు. ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ మౌలిక వసతులు లేని వాగులు, వంకల ప్రాంతాల్లో స్థలాలు కేటాయించడం పేదల భవిష్యత్తుతో చెలగాటమాడటమేనని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి హైకోర్టు ఆదేశాలను అమలు చేసి, తాము నివసిస్తున్న ప్రదేశంలోనే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు రామచంద్ర, లక్ష్మీనారాయణ, సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నరసింహప్ప, పోరాట కమిటీ సభ్యులు నరసింహా, నారాయణప్ప, నాగరాజు,, అశ్వర్థరెడ్డి, షామి, లక్ష్మినాయణ, నాగమణి, రజియాభాను, నాగప్ప, రాధిక, పాల్గొన్నారు.

# గర్భవతులకు పౌష్టికాహారం పంపిణీ



గర్భవతులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

**లేపాక్షి, జూన్ 15 ప్రభాతవార్త**

లేపాక్షి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భవతులకు రమామణి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కరణం రామానందన్ ఆధ్వర్యంలో సోమవారం పౌష్టికాహారాన్ని అందజేశారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ వెంకటచిరంజీవి గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి పలు సూచనలు సలహాలను అందజేశారు. అనంతరం రమామణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 55 మంది మాతృమూర్తులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కరణం రామానందన్ మాట్లాడుతూ తన జీవితకాలం మాతృమూర్తులు పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి వచ్చిన సమయంలో పౌష్టికాహారాన్ని అందచేస్తానని పేర్కొన్నారు. దాదాపు రెండు సంవత్సరాలుగా గర్భవతులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్లు కరణం రామానందన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# లేపాక్షి ఆలయానికి విచ్చేయాలని శృంగేరి పీఠాధిపతులకు ఆహ్వానం



విధుశేఖరభారతి మహాస్వామిని ఆహ్వానిస్తున్న దృశ్యం

**లేపాక్షి, జూన్ 15 ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన లేపాక్షి శ్రీదుర్గా పాపనాశేశ్వర వీరభద్రస్వామి దేవాలయ చైర్మన్ పరిగి వేణుగోపాలరావు సోమవారం శృంగేరి శారద పీఠాధిపతి జగద్గురువులు శ్రీవిధుశేఖరభారతి మహాస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా లేపాక్షి దేవాలయానికి విచ్చేసి స్వామివార్లను దర్శించుకోవడంతో పాటు గ్రామస్తులకు, భక్తులకు మంగళం జరిగేలా అనుగ్రహించాలని ఆయన జగద్గురువులను కోరారు. ఆలయ చైర్మన్ ఆహ్వానాన్ని మన్నించిన విధుశేఖరభారతి మహాస్వామి తప్పకుండా లేపాక్షి క్షేత్ర దర్శనానికి వస్తామని హామీ ఇస్తూ ఆశీస్సులు అందజేశారు. అదేవిధంగా సనాతన ధర్మ పరిరక్షణకు భవిష్యత్తులో మరింతగా కృషి చేయాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి దేవాలయ అర్చకులు లక్ష్మీనరసింహ, బ్రాహ్మణ సంఘం నాయకులు విద్యాసాగర్, కాశీ విశ్వనాథ్, పురోహితులు అనంతరామశర్మ, రత్నగిరి నాగేష్, సేవా మందిర్ సతీష్, సందీప్‌కుమార్‌శర్మ, ఇంద్రగంటి మంజునాథశర్మ, తదితరులు పాల్గొన్నారు.

# శివారు కాలనీల సమస్యలను పరిష్కరించండి

-మున్సిపల్ కమిషనర్‌కు సిపిఐ నాయకుల వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఐ నాయకులు

**గుంతకల్లు, జూన్ 15 ప్రభాతవార్త**

పట్టణ శివారు కాలనీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎం,లక్ష్మీదేవికి సిపిఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివారు కాలనీలైన ధోనిముక్కల రోడ్డు, ఎర్ర చెరువుకాలనీ, భీమిరెడ్డి కాలనీ, రామిరెడ్డి కాలనీ, సిఐటియు కాలనీ, అబ్దుల్‌కలాం కాలనీ, సంతోష్‌నగర్, తదితర కాలనీలు కనీస వసతులకు నోచుకోవడం లేదన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇక్కడ డ్రైనేజీలు, సిసి రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే పట్టణంలో జియో కేబుల్ వారు ఇష్టానుసారంగా గుంతలు తవ్వి వదిలేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు. కమిషనర్ వాటిపై దృష్టి సారించి పరిష్కరించాలని వారు కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, నాయకులు మహేష్, ఈశ్వరయ్య, మల్లయ్య, మురళీకృష్ణ, దేవేంద్ర, దాసరి శ్రీనివాసులు, పుల్లయ్య, ఉన్నారు.

# రక్తదానం మహోన్నతమైన మానవతా సేవ

- బెస్ట్ యూనివర్సిటీలో బెస్ట్‌గా రక్తదాన శిబిరం
- జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల వేడుకలు

-హాజరైన...జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు జిఎం సురేష్



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

**గోరంట్ల, జూన్ 15 ప్రభాతవార్త**

ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీలో సోమవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు జిఎం సురేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ శిబిరంలో 57 మంది యువతీ యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవతా సేవలో భాగస్వాములయ్యారు. రక్తదానం చేసిన ప్రతి దాతకు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ జిఎం సురేష్ మాట్లాడుతూ రక్తదానం అనేది మహోన్నతమైన మానవతా సేవ అని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాపాయంలో ఉన్న రోగులకు రక్తదానం ద్వారా అమూల్యమైన సహాయం అందించవచ్చని తెలిపారు. యువత ఎక్కువ సంఖ్యలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సమాజంలో రక్త కొరతను నివారించేందుకు రక్తదానం చేసి తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జి.బి విశ్వనాథ్, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఇమ్మాన్యుయేల్ అనుపల్లి, మెడికల్ ఆఫీసర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రామ్‌గోపాల్ మోపాలి, డాక్టర్ పిరులోడ్డ సుందరం, రెడ్ క్రాస్ క్షేత్రాధికారి బి. రమేష్, ఫిజికల్ డైరెక్టర్ శివ, హెల్త్ సెంటర్ స్టాఫ్ తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు. హిందూపురం ప్రభుత్వాసుపత్రి బ్లడ్ సెంటర్ సిబ్బంది రక్తదాన శిబిరంలో పాల్గొని రక్త యూనిట్లను సేకరించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి యూనివర్సిటీ యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు అందించిన సహకారాన్ని రెడ్ క్రాస్ ప్రతినిధులు అభినందించారు.

# పోలీసుల అదుపులో ఇరువురు అనుమానితులు

**గుత్తి, జూన్ 15 ప్రభాతవార్త**



అర్బన్ సిఐ రామారావు మాట్లాడుతున్న దృశ్యం

గుత్తి పట్టణంలో గంజాయి సరఫరా చేసే ఇరువురు అనుమానితులను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అందిన సమాచారం మేరకు అనంతపురం రోడ్డులో ఉన్న ఓ ఫర్టిలైజర్ దుకాణంలో 30 గ్రాముల గంజాయి, బ్లాక్ కరెన్సీని, పోలీసులు స్వాధీన పరుచుకున్నారు. ఈ సంఘటనలో పెద్దవడుగూరు మండలం గుత్తి అనంతపురం, దిమ్మగుడి గ్రామాలకు చెందిన ఇరువురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ వ్యవహారంపై అర్బన్ సిఐ రామారావును వివరణ కోరగా విచారణ నిర్వహిస్తున్నామని త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

# సర్ ఓటర్లు జాబితా సర్వే మెటీరియల్ పంపిణీ చేసిన తాసిల్దార్

**బెలుగుప్ప జూన్ 15 ప్రభావత వార్త**



సర్వే మెటీరియల్ పంపిణీ చేసిన దృశ్యం

బెలుగుప్ప మండల కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయంలో సోమవారం రోజున సర్ ఓటర్ల జాబితా మెటీరియల్ తాసిల్దార్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో బి ఎల్ ఓ లకు అందజేశారు ఈ సందర్భంగా తాసిల్దార్ అనిల్ కుమార్ మాట్లాడుతూ సక్రమంగా ఇంటింటికి వెళ్లి సర్వే చేసి ఫారం 6,ఫారం 7, పారం 8 లలో బి బి ఎల్ ఓ లు తప్పులు లేకుండా ఖచ్చితమైన ఓటర్ల జాబితాలను తయారు చేయాలి అందులో భాగంగా నక్కలపల్లి గ్రామంలో తాసిల్దార్ అనిల్ కుమార్ తో వెళ్లి ఓటర్ల జాబితాను సర్వే చేశారు అనంతరం తెలుగుదేశం జిల్లా కార్యదర్శి మల్లికార్జున బెలుగుప్ప గ్రామంలో ఓటర్ల జాబితాను ఇంటింటికి వెళ్లి సర్వే చేశారు ఈ కార్యక్రమంలో వీఆర్వోలు బి ఎల్ ఓ లు తదితరులు పాల్గొన్నారు.

# గోపాలమిత్రను తొలగించండి..

**కొత్తచెరువు జూన్ 15 ప్రభాతవార్త :** కొత్తచెరువు మండలం బండ్లపల్లి గ్రామంలో గోపాలమిత్రగా పనిచేస్తున్న వినోద్ ఇటీవల వైసిపిచేపట్టిన ర్యాలీలో ద్విచక్రవాహనం వైసిపిజండాకట్టుకుని ర్యాలీలోపాల్గొనడం జరిగింది అయితే సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో పిజిఆర్ఎస్‌లో అతని పైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని వినతి పత్రం ద్వారా సమర్పించారు అలాగే అతని విధుల నుంచి తప్పించి మరొకరికి అవకాశం కల్పించాలని కొత్తచెరువు మండల కన్వీనర్ వలిపి శ్రీనివాసులు మరి కొంతమంది టీడీపీ నాయకులుకలిసి అధికారులను కోరారు ఈ సందర్భంగా వారు క్షేత్రస్థాయిలో విచారించి తప్పకుండా క్రమశిక్షణ చర్యలు చేపడతామని తెలిపారు.

# రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు నాయ్య నిర్ణేతగా కె.రజనీకుమారి

-అభినందనలు తెలిపిన జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేష్



రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు జడ్జీగా నియమితురాలై నియామక సర్టిఫికేట్ అందుకొంటున్న టి.రజనీకుమారి

**ఉరవకొండ, జూన్ 15 ప్రభాతవార్త**

ఉరవకొండ పట్టణానికి చెందిన హిందీ ఉపాధ్యాయురాలు టి.రజనీ కుమారి యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తరుపున 2026-27 సంవత్సరానికి రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు న్యాయ నిర్ణేతగా (జడ్జీ) ఎంపికై క్రిష్ణా జిల్లా మచిలీపట్నంలో శిక్షణ పూర్తి చేశారు. ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూనే యెగా పట్లగల మక్కువతో అందులో రాణించి ఆసక్తిగల వారికి యోగ విద్యను బోధిస్తూ పట్టుదలతో రాష్ట్రస్థాయిలో జడ్జీగా నియమితులు కావడంపై జై కిసాన్ ఫౌండేషన్ చైర్మెన్ నాగమల్లి ఓబులేష్ అభినందించారు.టి.రజనీకుమారితోపాటు ఉరవకొండకు చెందిన టి.శ్రీవాణి, టి.సృజన కూడా రాష్ట్రస్థాయి యోగాసన జడ్జీలుగా నియమితులయ్యారని వారికి శుభాకాంక్షలు తెలిపారు. టి.రజనీకుమారి జాతీయ స్థాయిలో కూడా మరింత రాణించి గుర్తింపు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

# చెత్తతో సంపద తయారీ కేంద్రంలో వానపాముల ఎరువు తయారీ

-ఉరవకొండ ఎరువును కలెక్టరేట్‌లో స్టాల్ ఏర్పాటుచేసి విక్రయం



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వానపాముల ఎరువు సేల్ కౌంటర్‌వద్ద డిప్యూటీ ఎంపీడీవో సతీష్‌కుమార్, పంచాయతీ పరిపాలన అధికారి మహమ్మద్ రఫీ

**ఉరవకొండ, జూన్ 15 ప్రభాతవార్త**

ఉరవకొండ పట్టణం లోని చెత్తతో సంపద తయారీ కేంద్రంలో (ఎస్‌డబ్ల్యూపీసీ) వర్మీ కంపోస్టు (వానపాముల ఎరువు) తయారైంది. జిల్లా కేంద్రం అనంత పురంలోని కలెక్టరేట్‌లో సోమవారం జీఎస్ డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎంపీడీవో సతీష్‌కు మార్, మేజర్ గ్రామ పంచాయతీ పరిపాలన అధికారి షేక్ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేసి ఎరువును విక్రయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టరేట్‌లో



వానపాముల ఎరువును విక్రయిస్తున్న దృశ్యం

ఏర్పాటు చేసిన స్టాల్‌కు 50 కేజీల ఎరువును తీసుకొచ్చామని ఉరవకొండలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో మరో 100 కేజీల వరకు వానపాముల ఎరువు అందుబాటులో ఉందని అవసరమైన వారు కేజీకు 20 రూపాయలు చెల్లించి కొనగోలు చేసుకోవచ్చన్నారు. వానపాముల ఎరువుతో నేల సారవంతమవుతుందని, నేల భౌతిక స్థితి మెరుగుపడుతుందని, రసాయన ఎరువుల అవసరం తగ్గి పంటలు బాగా పండుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్‌సీ కార్యాలయం రిసోర్స్‌పర్సన్ గంగిరెడ్డి, పంచాయతీ మేస్త్రీ నాగరాజు, హరిత రాయబారులు పాల్గొన్నారు.

# వ్యక్తుల అరెస్టు అవగాహన సదస్సు

## హైకోర్టు అడ్వకేట్,లీగల్ అడ్వయిజర్ ఎస్.సుభాన్

**అనంపురం కల్చరల్, జూన్ 15 ప్రభాతవార్త**



హైకోర్టు అడ్వకేట్,లీగల్ అడ్వయిజర్ ఎస్.సుభాన్

అరెస్టుకు గల కారణాలు" అనగా ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకోవాల్సిన అవసరాన్ని కలిగించే నిర్దిష్టమైన, సవివరమైన వాస్తవాలు,ఆరోపణలు. భారతీయ నేర చట్టం (ఉదాహరణకు, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, 2023లోని సెక్షన్ 47) ,రాజ్యాంగంలోని ఆర్టికల్ 22 ప్రకారం, పోలీసులు ఈ వివరాలను అరెస్టు అయిన వ్యక్తికి వారు పూర్తిగా అర్థం చేసుకోగల భాషలో తెలియజేయాలి. అరెస్టు కారణాలకు సంబంధించిన చట్టపరమైన వ్యవస్థలో అనేక కీలకమైన పారామితులు ఉన్నాయి:

1. లిఖిత పూర్వక కారణాల హక్కుఅరెస్టుకు గల కారణాలను మౌఖికంగా తెలియజేయడం సరిపోదని సుప్రీం కోర్టు (ఉదాహరణకు, మిహిర్ రాజేష్ షా వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో) నిర్దేశిస్తుంది. దాదాపు అన్ని పరిస్థితులలోనూ దర్యాప్తు అధికారులు అరెస్టుకు గల కారణాలను తప్పనిసరిగా రాతపూర్వకంగా సమర్పించాలి.
2. రెండు గంటల నియమంఅరెస్టు చేసిన కచ్చితమైన క్షణంలో (ఉదాహరణకు, అనుమానితుడిని నేరం చేస్తున్నప్పుడు పట్టుకోవడం) లిఖిత పూర్వక కారణాలను అందించలేకపోతే, పోలీసులు వాటిని సహేతుకమైన సమయంలోగా అందించాలి. అరెస్టు అయిన వ్యక్తిని వారి తొలి రిమాండ్ విచారణకోసం మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచేందుకుకనీసం రెండు గంటల ముందు లిఖితపూర్వకకారణాలను అందజేయాలని సుప్రీంకోర్టు నిర్దేశించింది.
3. "కారణాలు" ,"ఆధారాలు" మధ్య తేడాఅరెస్టుకు గల కారణాలు: విస్తృతమైన, సాధారణ ప్రకటనలు (ఉదాహరణకు, "హత్య నేరం కింద అరెస్టు చేయబడ్డారు").అరెస్టుకు గల కారణాలు: నిర్దిష్టమైన, వ్యక్తిగత వివరాలు. వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం అవసరమని పోలీసులకు తెలిసిన అన్ని ప్రాథమిక వాస్తవాలను అవి కలిగి ఉండాలి, తద్వారా ఆ వ్యక్తి తనను తాను సమర్థించుకోవడానికి, రిమాండ్‌ను వ్యతిరేకించడానికి లేదా బెయిల్ కోరడానికి వీలు కలుగుతుంది.
4. బెయిలబుల్ vs. నాన్‌బెయిలబుల్ నేరాలుబెయిలబుల్ నేరానికి సంబంధించి ఒక పోలీస్ అధికారి ఎవరినైనా వారెంట్ లేకుండా అరెస్టు చేస్తే, BNSSలోని సెక్షన్ 47 ప్రకారం, ఆ అధికారి అరెస్టు అయిన వ్యక్తికి బెయిల్‌పై విడుదలయ్యే అర్హత , పూచీకత్తుదారులను ఏర్పాటు చేసుకునే హక్కు గురించి వెంటనే తెలియజేయాలి.
5. నిబంధనలను పాటించకపోవడం వల్ల కలిగే పరిణామాలు లిఖిత పూర్వక కారణాలను అందించకపోవడం కేవలం ఒక చిన్న ప్రక్రియాపరమైన లోపం మాత్రమే కాదని, అది అరెస్టును , తదుపరి రిమాండ్‌ను చెల్లనిదిగా చేస్తుందని, తద్వారా నిందితుడు తక్షణమే విడుదల కావడానికి అర్హుడవుతాడని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# సత్వరమే పిజిఆర్ఎస్ అర్జీలను పరిష్కరించాలి

## - ఐవిఆర్ఎస్ ఫీడ్ బ్యాక్ పాజిటివిటి శాతం మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలి - జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం కలెక్టరేట్ జూన్ 15 ప్రభాతవార్త

అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించగా, ఇందులో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ ఏ.మలోల, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జున రెడ్డి, రమేష్ రెడ్డి, ఆనంద్, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 700 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించడం జరిగింది. ఇందులో అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలకు వెంటనే పరిష్కారం చూపించాలని అధికారులకు అక్కడికక్కడే జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమంలో వస్తున్న అర్జీలను సత్వరమే నాణ్యతగా పరిష్కరించాలని ఆయా అధికారులను ఆదేశించారు. ఐవిఆర్ఎస్ ఫీడ్ బ్యాక్ కు సంబంధించి ఆర్టీసీ పరిధిలో కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ, తదితర బస్టాండ్ లలో శుభ్రత పెంచాలని, ఆర్.అండ్.బి పరిధిలో రోడ్లు గుంతలు లేనివిగా తయారు చేయాలని, ఆర్డబ్ల్యుఎస్ పరిధిలో తాగునీటి సరఫరాలో నీటి నాణ్యత మరింత పెంచాలని, హౌసింగ్, సమగ్ర శిక్ష, సర్వే శాఖల పరిధిలో పాజిటివిటీ శాతం పెంచడంపై మరింత పురోగతి తీసుకురావాలని ఆదేశించారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

ఈ కార్యక్రమంలో ఏపీఎస్పిడిసిఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, పీఆర్ ఎస్ఈ సుబ్బ రాయుడు, పశుసంవర్ధక శాఖ జెడి ప్రేమ్ చంద్, సిపిఓ అశోక్ కుమార్, జిల్లా స్వర్ణ గ్రామ వార్డు కార్యాలయాల అధికారి నాసర రెడ్డి, ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, డిఎండబ్ల్యుఓ రామసు బ్బారెడ్డి, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, ఏపిఎంఐపి పిడి రఘు నాథరెడ్డి, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ కె.శ్రీనివాసులు, బిసి వెల్ఫేర్ డిడి ఖుష్బూకొఠారి, హౌసింగ్ పిడి శైలజ, వయోజన విద్య ఉపసంచాలకులు వెంకటేశ్వర్లు, ఎస్సి కార్పొరేషన్ ఈడి కుముద, డిఎం హెచ్ఓ ఈబి.దేవి, డిటిడబ్ల్యుఓ శ్రీనివా సరావు, బిసి కార్పొరేషన్ ఈడి సుబ్ర మణ్యం, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, సెక్షన్ సూపరింటెండెంట్లు వసంతలత, యుగేశ్వరిదేవి, రియజుద్దీన్, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 10వ తరగతి జిల్లా ఫస్ట్ విద్యార్థికి కలెక్టర్ ప్రశంసలు

అనంతపురం, జూన్ 15 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం ముంటిమడుగు గ్రామం బాలిక ఈడిగ హారిక పదవ తరగతి జిల్లా ఫస్ట్ వచ్చిన సందర్భంగా అనంతపురం జిల్లా కలెక్టర్ దగ్గరికి స్థానిక సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ ముంటి మడుగు కేశవరెడ్డి అమ్మాయిని తీసుకెళ్లి కలెక్టర్‌తో సన్మానం చేయించారు. వీరితోపాటు అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పూల నాగరాజు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గౌస్ మోదిన్, మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాయల్, మురళి, తదితరులు కలెక్టర్ దగ్గరికి వెళ్లారు. అమ్మాయిని శాలువాతో కప్పి బొకే అందజేసి భవిష్యత్తులో మరింత ఉత్సాహంగా చదువు కొని రాష్ట్రాన్ని కోసం పాటు పడాలని కలెక్టర్ అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న జిల్లా కలెక్టర్

# సమస్త గాండ్ల తెలికుల ప్రజా సంక్షేమ సంఘంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు ప్రాధాన్యత

## - రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కేపి కుమార్ - రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా దూలం లలితమ్మ

అనంతపురం కల్చరల్, జూన్ 15 ప్రభాతవార్త

రాష్ట్రస్థాయిలో నూతనంగా ఆవిర్భవించిన సమస్త గాండ్ల తెలికుల ప్రజా సంక్షేమ సంఘం (ఎస్.జి.టి.పి.ఎస్.ఎస్) రాష్ట్ర నూతన కమిటీ ఉపాధ్యక్షుడిగా కేపీ.కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో అఖిల గాండ్ల తెలికుల ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సంక్షేమ సంఘం (ఏ.జి.టి.యు.పి.ఎస్.ఎఫ్)ఆధ్వర్యంలో, రాష్ట్ర నాయకులు గిరి శ్రీనివాస్ నేతృత్వంలోని ప్రజా జేఏసీ పిలుపు మేరకు గాండ్ల తెలికుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం హోటల్ సన్ స్క్వేర్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సమస్త గాండ్ల తెలికుల ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉమ్మడి అనంత పురం జిల్లాకు రాష్ట్ర కార్యవర్గంలో ప్రాధాన్యత కల్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడిగా వాకాటి హరికృష్ణ(తిరుపతి)ను, ప్రధాన కార్యదర్శిగా బత్తిన సత్యనారాయణ (అనకాపల్లి)ను ఏకగ్రీవంగా ఎన్నుకోగా, కార్య నిర్వాహ కవర్గంలో భాగంగా కేపీ.కుమార్‌కు అనంతపురం జిల్లా నుంచి రాష్ట్ర సంఘంలో ఉపాధ్యక్షుడిగా ప్రాతినిధ్యం దక్కింది. తనకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు వాకాటి హరికృష్ణకు, రాష్ట్ర నాయకులు గిరి శ్రీనివాస్, ఏజిటియుపిఎస్ఎస్ అనంతపురం జిల్లా శాఖ అధ్యక్షుడు చిగిచెర్ల నాగరాజు, జిల్లా కోశాధికారి సూర్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాండ్ల నరసింహుడు, రాష్ట్ర మహిళా విభాగం నాయకురాలు విజయ లక్ష్మికి కేపీ కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో కులస్తుల అభ్యున్నతికి, సంక్షేమానికి, విద్య, రాజకీయ, సామాజిక రంగాల్లో ఎదుగుదలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన పేర్కొన్నారు. అలాగే, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా దూలం లలితమ్మ (అనంతపురం)ను, ఉపాధ్య క్షురాలుగా విష్ణు మాత (శ్రీ సత్య సాయి జిల్లా), యువజన విభాగం ఉపాధ్య క్షుడిగా ముత్యాల ఆదినారాయణ (సలకం చెరువు), రాష్ట్ర కార్యదర్శిగా గాండ్ల జయంత్ (సత్య సాయి జిల్లా)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తమకు ప్రాతినిధ్యం కల్పించిన రాష్ట్ర నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.



రాష్ట్ర ఉపాధ్యక్షులు కెపి.కుమార్‌ను సన్మానిస్తున్న నేతలు

# అనుక్షణం అప్రమత్తత అవసరం

అనంతపురం క్రైమ్ జూన్ 15 ప్రభాతవార్త

విధుల్లో అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని గన్ మెన్లకు పోలీసు అధికారులు సూచించారు. సోమవారం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న గన్‌మెన్‌లకు స్థానిక జిల్లా శిక్షణా కేంద్రం నందు ప్రత్యేక రీఫ్రెష్ కోర్సులు నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఏ.ఆర్. డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్.ఐ. పవన్ కుమార్ అధికారికంగా ప్రారంభించి, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఏ.ఆర్. డీఎస్పీ, ఆర్.ఐ.లు శిక్షణలో పాల్గొన్న గన్‌మెన్లకు పలు కీలక సూచనలు చేశారు. విధి నిర్వహణలో క్షణకాలం కూడా అజాగ్రత్తగా ఉండకూడదని, వివిపిల భద్రత విషయంలో ఎల్లప్పుడూ అత్యంత అప్రమ త్తంగా వ్యవహరించాలని సూచించారు.

తమకు కేటాయించిన ఆయుధాలను నిరంతరం శుభ్ర ంగా, సురక్షితంగా ఉంచుకోవాలని అత్యవసర సమయాల్లో వాటిని ఎలా ఉప యోగించాలనే అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. శారీరక సామర్థ్యంతో పాటు మానసిక ప్రశాంతత, సమయస్ఫూర్తి చాలా అవసరమని, ఈ రీఫ్రెష్ కోర్సు అందుకు ఎంతగానో ఉపయోగపడు తుంద న్నారు. క్రమ శిక్షణతో, బాధ్యతా యుత ంగా నడుచుకోవాలని స్పష్టం చేశారు. ముఖ్య వ్యక్తుల రక్షణ బాధ్యత కలిగిన పీఎస్ఓల పాత్ర అత్యంత కీలకమైనది. మారు తున్న పరిస్థితులకు అనుగుణంగా మీ నైపుణ్యాలను, శారీరక దృఢత్వాన్ని మరింత పెంపొందించుకోవడానికే ఈ రీఫ్రెష్ కోర్సును ఏర్పాటు చేయడం జరిగింది. సిబ్బంది అందరూ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఏ.ఆర్. డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీసీ సిబ్బంది, జిల్లాలోని వివిధ విభాగాల నుండి వచ్చిన పీఎస్ఓ లు,ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



గన్మెన్లకు దిశా నిర్దేశం చేస్తున్న దృశ్యం

# సంబరాలపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదా - మాజీ మేయర్ మహ్మద్ వసీం విమర్శ

అనంతపురం సిటీ, జూన్ 15 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వ పాలనలో రెండేళ్లలో చేసింది ఏమీ లేకపోగా సంబరాల పేరిట చూపిస్తున్న శ్రద్ధ ప్రజా సమస్యల పరిష్కారం పట్ల లేదా అని మాజీ మేయర్ మహ్మద్ వసీం విమర్శించారు. జిల్లా వైసిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో అనేక హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్న హామీలను అమలు చేయకపోగా రెండేళ్ల పాలన అంటూ సంబరాలు చేసుకుంటున్న తీరును చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. అనంతపురం నగరంలో మూడు రోజుల క్రితం కురిసిన వర్షాల వల్ల అనేక ప్రాంతాలు జలమయం అయ్యాయన్నారు. వర్షాలు కురుస్తాయని ముందస్తు సమాచారం ఉన్నా అధికారులు కానీ ప్రజా ప్రతినిధులు కానీ ముందస్తు చర్యలు తీసుకో వడంలో వైఫల్యం వల్ల ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. రెండేళ్ల క్రితం ఎమ్మెల్యేగా దగ్గుపాటి ప్రసాద్ ఎన్నికైన తర్వాత కురిసిన వర్షాలకు రామ్ నగర్ అంబేద్కర్ ఫ్లైఓవర్ సమీపంలో నిలిచిన నీటిని చూసి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు అదే ప్రాంతం చెరువును తలపించేలా తయారైందని, నీటిని మళ్లించేందుకు రెండు రోజులు గడిచినా చర్యలు తీసుకోకపోవడం వల్ల ప్రజ లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నాడు హడావుడిచేసిన ఎమ్మెల్యే సమస్యను ఎందుకు పరిష్కరించ లేక పోయారని, అదే ప్రాంతంలో ఎమ్మెల్యే నివాసం కూడా ఉందన్నారు. దీంతో పాటు అధికారుల నిర్లక్ష్యం వల్ల ముందు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల అనేక కాలనీలలో వర్షపు నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. గతంలో తమ పాలక వర్గం ఉన్న సమయంలో ముందస్తు చర్యలు తీసుకో వడం వల్ల వర్షాలు కురిసినా ప్రజలు ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు సమస్య పరిష్కారం అయ్యేలా ప్రత్యేక యంత్రాలను, సిబ్బందిని ఏర్పాటు చేసేవారన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అనంతపురంలో కంటే విజయవాడ, హైదరాబాద్‌లలో తన వ్యాపారాల నిర్వాహణకే అధిక ప్రాధాన్యత ఇస్తుండటం వల్ల నగరంలో పారిశు ద్ధ్యంతో పాటు ఇతరాత్ర సమస్యలతో ప్రజలు సతమతమయ్యే పరిస్థితి ఏర్పడిం దన్నారు. ఇప్పటికైనా ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. విలేకర్ల సమావేశంలో వైసిపి మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు సైఫుల్లా బేగ్, మాజీ కార్పొరేటర్లు కమల్‌భూషణ్, శ్రీనివాసులు, ఇషాక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మేయర్ మహ్మద్ వసీం

# శైలజనాథ్ ను విమర్శించే హక్కు కూటమినాయకులకు లేదు

## వైసీపీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి

బుక్కరాయసముద్రం జూన్ 15 ప్రబాతవార్త

శైలజనాథ్ ను విమర్శించే హక్కు కూటమినాయకులకు లేదని వైసీపీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని వైసీపీ శింగనమల నియోజకవర్గం కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ వారు మాట్లడుతూ ఈ నెల 12న శింగనమల నియోజకవర్గం కేంద్రంలో వెన్నుపోటుకు రెండేళ్ళ అనేకార్యక్రమానికి నియోజకవర్గం లోని 6 మండలాల నుండి వేలాదిమంది నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వాటిని జీర్ణించుకోలేక కూటమి నాయకులు శింగనమలలో విలేకర్ల సమావేశం నిర్వహించి మాజీ మంత్రి శైలజనాథ్ మీద అవాక్కులు, చవాక్కులు మాట్లాడినారు. మేము ఒక్కటే చెప్పుచున్నాం వెన్నుపోటు ఎవరిదో టిడిపి నాయకులకే వదిలేస్తున్నం, గతంలో చంద్రబాబునాయుడు కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే, మంత్రిగా పనిచేసి కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచి, దివంగతనేత ఎన్‌టిరామారావు పంచనచేరి టిడిపిలో చేరి ఆయకు వెన్నుపోటు పోడిచి టిడిపి పార్టీని లాక్కున్నది ఎవరు చంద్రబాబునాయుడు కాద, వెన్నుపోటు పొడిచింది ఎవరు ప్రజలందరికి తెలుసు. చంద్రబాబునాయుడు ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నమ్మి ఓట్లు వేయించుకొని అధికారం చేపట్టి రెండేళ్ళ అయిన ఒక్క పథకమైన సక్రమంగా అమలు చేయకుండ ప్రజలకు వెన్నుపోటు పొడిచింది కూటమి ప్రభుత్వం కాదని ప్రశ్నస్తున్నాం. ఇంతవరకు అమ్మ ఒడి లేదు, యు వతకు నిరుద్యోగభృతిలేదు, పిల్లలకు 1500లు లేదు, మహిళలకు 18వేలు లేదు, రైతులకు ఇన్స్ రెన్సు లేదు, ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన రైతులకు రైతుభరో సాలేదు, మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్‌లేదు ఇలా చెప్పుకుంట పోతే ఎన్నో ఉన్నా యి. గతంలో వైసీపీ ప్రభుత్వ ంలో ప్రవేవపెట్టిన పథకాలు మాత్రమే కూటమి ప్రభుత్వం అమలు చేస్తుంది తప్ప, ఒక్క కొత్త పథకమైన ప్రారంభించారు. పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని జగన్మోహన్‌రెడ్డి ప్రవేశ పెడితే వాటినే మీరు కొనసాగిస్తు డబ్బాలు కొట్టుకుంటున్నారు. మేము నియోజకవర్గంలో గత ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి చేసిన అభివృద్ధి, శైలజనాథ్ చేసిన అభివృద్ధి పనులు చూపించడానికి మేము సిద్ధం, మీరు చూడడానికి సిద్ధంగా ఉన్నారా అని సవాల్ విసిరారు. కూటమి నాయకులకు శైలజనాథ్ ను విమర్శించే అర్హత మీకులేదన్నారు. 2029 లో తప్పకుండా శింగనమల నియోజకవర్గంలో వైసీపీ జెండాను ఎగరవేస్తాం శైలజనాథ్ ను ఎమ్మెల్యే గెలిపించి రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మహేశ్వరరెడ్డి, యల్లారెడ్డి, జడ్పిటీసీ నీలం భాస్కర్, పూల నారాయణ స్వామి, మాజీ సర్పంచు పార్వతి, వైసీపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రదాన కార్యదర్శి సాకే రామాంజినేయులు, నియోజకవర్గం అధ్యక్షుడు మంత్రి అంజి, బుల్లే ఈశ్వరయ్య, మారుతి, నాగేష్, సత్తిరెడ్డి, పవన్‌సాయి, మాజీ డీలరు కుళ్ళాయప్ప, తదితిరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లడుతున్న వైసీపీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి

# విద్యతోపాటు సేవా కార్యక్రమాల్లో విద్యార్థుల కృషి అమోఘం

## - జెఎన్‌టియుఏ రక్తదానంలో అవార్డు రావడం అభినందనీయం - జెఎన్‌టియు విసి సుదర్శన్‌రావు

అనంతపురం సిటీ, జూన్ 15 ప్రభాతవార్త

జెఎన్‌టియుఏ విద్యార్థులు విద్యతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందంజలో ఉండటం గర్వకారణమని జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌రావు కొనియాడారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఇటీవల వేలూరు సిఆర్ రెడ్డి కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో జెఎన్‌టియుఏ ఎన్ఎస్ఎస్-2 విభాగానికి రాష్ట్రస్థాయిలో అవార్డు రావడంతో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కళ్యాణి రాధలు, జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌రావు అభినందించారు. అవార్డులతో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ (యూనిట్ ఇన్‌చార్జ్) డా.కళ్యాణి రాధ సోమవారం విసి సుదర్శన్‌రావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదాన సేవల్లో జెఎన్‌టియుఏ ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఒకే రోజు 200 యూనిట్ల రక్త సేకరణతో రాష్ట్ర స్థాయిలో అరుదైన ఘనత సాధించడం అభినందనీయమన్నారు. సమాజ సేవ, మానవతా విలువలు, యువతలో సామాజిక బాధ్యతలు పెంపొందించే లక్ష్యంతో జెఎన్‌టియుఏ ఎన్ఎస్ఎస్ యూనిట్ విశిష్ట సేవలను అందిస్తూ అరుదైన గౌరవాన్ని దక్కించుకోవడం జెఎన్‌టి యుఏకి గర్వకారణం అన్నారు.

రిజిస్ట్రార్ కృష్ణయ్య మాట్లాడుతూ.. విద్యార్థులలో విద్యతోపాటు సామాజిక స్పృహ పెంపొందించడానికి ఎన్ఎస్ ఎస్ కార్యకలాపాలు అత్యంత కీలకమన్నారు. డా.కళ్యాణి రాధ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలు విశ్వవిద్యాలయానికి మంచి గుర్తింపు తీసుకొచ్చాయని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు. డాక్టర్ కళ్యాణి రాధ మాట్లాడుతూ.. రక్తదానం అనేది మహా దానం అని ఒక యూనిట్ రక్తం పలువురు జీవితాల్లో ఆశా కిరణం నెల కొల్పగలదని పేర్కొన్నారు. జెఎన్ టియుఏ విద్యార్థులు సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి రక్తదాన కార్యక్రమాలను విజయవంతం చేయ డం గర్వకారణం అన్నారు. ఈ విజయానికి సహకరించిన ప్రతి విద్యార్థికి, అధ్యాపకులకు, సిబ్బందికి విశ్వ విద్యాలయ యాజమాన్యానికి ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ కోఆర్డినేటర్ కళ్యాణి రాధను, విసి ఓఎస్‌డి దేవన్న, కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, జెఎన్‌టియుఏ పిఆర్ఓ ఓం ప్రకాష్, తదితరులు అభినందించారు.



అభినందిస్తున్న జెఎన్‌టియు విసి సుదర్శన్‌రావు

# ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సర ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం

అనంతపురం న్యూటౌన్, జూన్ 15 ప్రభాతవార్త

ఆర్ట్స్ కళాశాలలో అందుబాటులో ఉన్న వివిధ డిగ్రీ కోర్సుల ప్రథమ సంవత్సర ప్రవేశాలకు సంబంధించిన ఆఫ్లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.పద్మశ్రీ తెలిపారు. ప్రవేశాలకు ఆసక్తి ఉన్న విద్యార్థి. విద్యార్థినులు జూన్ 15 నుంచి కళాశాలకు వచ్చి తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. కళాశాల ప్రత్యేకతలు, వసతులు: నాగ్ ఎ గ్రేడ్, స్వయంప్రతిపత్తి ఈ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ జాతీయ అంచనా గుర్తింపు మండలి చేత వరుసగా మూడు సార్లు గ్రేడ్ సాధించింది. స్వయంప్రతిపత్తి హోదా కలిగిన ఈ కళాశాల.. విద్యార్థి కేంద్రిత బోధన, ఆచరణాత్మక లక్ష్యాలు ,సరళమైన విద్యా విధానాలతో ఉత్తమ ఫలితాలను అందిస్తోంది. వైవిధ్యభరితమైన కోర్సులు: విద్యార్థులు తమ ఆసక్తులకు అనుగుణంగా ఎంచుకునేందుకు వీలుగా కళాశాలలో 40 ప్రధాన సబ్జెక్టులు ఆప్షనల్స్ అందుబాటులో ఉన్నాయి. **వసతి గృహ వసతి :** కళాశాల ప్రాంగణం లోనే విద్యార్థి, విద్యార్థినులకు విడివిడిగా సురక్షితమైన హాస్టల్ వసతి ఉంది. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ. బాధ్యతాయుతమైన పర్యవేక్షణతో ఈ వసతి గృహాలు నిర్వహించబడుతున్నాయి. ఎన్.సి.సి. ఎన్.ఎస్. ఎస్ విభాగాలు: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేలా ఈ కళాశాలలో 5 ఎన్.ఎస్.ఎస్ యూనిట్లు, బాలురు ,బాలికలకు ప్రత్యేకంగా రెండు ఎన్.సి.సి యూనిట్లు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ సి సర్టిఫికేట్ సాధించడం ద్వారా విద్యార్థులు ఉన్నత చదువుల్లో అద్భుతమైన అవకాశాలను దక్కించు కోవచ్చు. ఉపాధి అవకాశాలు : విద్యార్థులకు క్యాంపస్ సెలక్షన్స్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కళాశాలలో ప్రతిష్ఠాత్మకమైన జేకేసీ సెల్ నిరంతరం శ్రమిస్తోంది. క్రీడా సౌకర్యాలు: ఇండోర్, అవుట్ డోర్ క్రీడలకు సరిపోయేలా ఎంతో విశాలమైన ఆట స్థలం, చక్కని వసతులు ఇక్కడ ఉన్నాయి. చారిత్రక నేపథ్యం: నగర నడిబొడ్డున కొలువై, సుమారు 111 సంవత్సరాల ఘనమైన, అద్భుతమైన చరిత్ర, గొప్ప వారసత్వాన్ని ఈ కళాశాల కలిగి ఉంది.

# పర్యాటక రంగ అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష

## జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి - కలెక్టర్, జిల్లా పర్యాటక కౌన్సిల్ చైర్మన్ ఓ.ఆనంద్

అనంతపురము కలెక్టరేట్, జూన్ 15 ప్రభాతవార్త

జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ మరియు జిల్లా పర్యాటక కౌన్సిల్ చైర్మన్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా పర్యాటక అభివృద్ధి కౌన్సిల్ సమావేశాన్ని జిల్లా పర్యాటక ప్రమోషన్ కౌన్సిల్ చైర్మన్ హోదాలో జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని ఎన్టీఆర్ పార్క్ దగ్గర బోటింగ్ మొదలుపెట్టాలన్నారు. అనంతపురం శిల్పారామంలో మాస్టర్ ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు చేయించాలని, అక్కడ చెక్ డ్యాంలో బోటింగ్, ఫుడ్ కోర్ట్ లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని సైన్స్ సెంటర్, ఆర్కియాలజీ మ్యూజియం, శిల్పారామంలను రోజు రెండు మూడు పాఠశాలల విద్యార్థులు విజిట్ చేసేలా చూడాలని, సైన్స్ సెంటర్ లో సిఎస్ఆర్ నిధుల కింద సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేయించాలని డిప్యూటీ డిఈఓకి సూచించారు. జిల్లాలో కొన్ని చారిత్రక ప్రాంతాలు, కట్టడాల గురించి ఆర్కియాలజీ శాఖ అధికారులు విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. ప్రాచీన ప్రదేశాలలోని కోనేరులను ఆధునికరించి ప్రచారం కల్పించాలన్నారు. కుందుర్పి, గుత్తి, బుక్కరాయసముద్రం ప్రాంతాలలో పర్యాటకరంగా అభివృద్ధిపై దృష్టి సాధించాలని అధికారులను ఆదేశించారు ఈ సమావేశంలో జిల్లా పర్యాటక అధికారి ఓబులమ్మ, ద్వామా పిడి సలీం భాష, ఆర్కియాలజీ ఏడి స్వామి నాయక్, నగర పాలక సంస్థ కమిషనర్ జస్వంత్ రావు, నగర పాలక సంస్థ ఎస్ఈ రాజశేఖర్, పీఆర్ ఎస్ఈ సుబ్బారాయుడు, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ కె.శ్రీనివాసులు, మెప్మా పిడి విశ్వజ్యోతి, ఎండోమెంట్ ఏసి మల్లికార్జున ప్రసాద్, మైన్స్ డిడి ఆదినారాయణ, డిప్యూటీ డిఈఓ శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు నాగేశ్వర రెడ్డి, టూరిజం మేనేజర్ దీపక్, శిల్పారామం ఏఓ శివప్రసాద్, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## - డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ కమర్షియల్ ఇంజనీర్ కవితకు వినతిపత్రం

అనంతపురం, జూన్ 15 ప్రభాతవార్త బ్యూరో

విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ కమర్షియల్ ఇంజనీర్ కవితకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు ప్రజలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారి సమస్యలు సంవత్సరాలుగా పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణ కమిటీ (పీఆర్‌సీ)ని వెంటనే ఏర్పా టు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సి ంగ్ కార్మికులను క్రమబద్ధీకరించి "సమాన పనికి సమాన వేతనం" సూత్రం ప్రకారం తెలంగాణ రాష్ట్రంతో సమానంగా రూ.48వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణ విధానాలను నిలిపివేసి ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాలని, విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ కమర్షియల్ ఇంజనీర్ కవితను కోరారు. సమస్యలు సామరస్య పూర్వకంగా పరిష్కారం కాకపోతే రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్.వి.నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎస్.నబి, విద్యుత్ ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు

# పిల్లలు అంగన్వాడి పాఠశాల నందు గ్రాడ్యూషన్ డే

బుక్కరాయసముద్రం, జూన్ 15 ప్రభాతవార్త

బుక్కరాయసముద్రం మండల పరిదిలోని రేకులకుంట గ్రామంలో సోమవారం అంగన్వాడి కేంద్రంలో గ్రాడ్యూషనన డే కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడి నుండి 1వ తరగతికి అర్హులైన 12 మంది పిల్లలని ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణ, అంగన్వాడి టీచ్చర్ విమల సుజాత, స్వాతి, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

1వ తరగతిలో చేరిన అంగన్వాడి



# అంతర్గత కుమ్ములాటలతో వైసిపి నేతలు

( **మొదటి పేజీ తరువాయి** ) గ్రూపులుగా ఉన్నారు. ఈ గ్రూపు రాజకీయాల వల్ల 2024 ఎన్నికల్లో పట్టణానికి సంబంధం లేని అభ్యర్థి చేతిలో వైసిపి ఓడి పోవాల్సి వచ్చింది. అయినా నాయకులకు జ్ఞానోదయం కలగడం లేదు. గుంతకల్లు నియోజకవర్గంలో ప్రస్తుత సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి, ఏడిసిసి బ్యాంకు మాజీ అధ్యక్షులు పామిడి వీరాంజినేయులు మధ్య తగాదాలు కొనసాగుతున్నాయి. ఉరవకొండ నియోజకవర్గంలో సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మధ్య అంతర్గత విబేధాలు భగ్గుమంటున్నాయి. ఆ నియోజకవర్గంలో కొందరు నేతల విబేదాలతో అక్కడ టిడిపి ప్లస్ పాయింట్‌గా మారింది. తాడిపత్రి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి స్థానికంగా కొందరు నేతలతో విబేదాలు ఉన్నాయి. రమేష్‌రెడ్డి, ముంబాయి రమేష్, మరో ముస్లిం సమన్వయ కర్త పెద్దారెడ్డి నేతను కలుపుకెళ్లడం లేదని అభిప్రాయం ఉంది. మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్‌రెడ్డి వ్యవహార శైలిపై పెద్దారెడ్డి తనదైన శైలిలో ఆందోళనలు చేస్తున్నప్పటికీ స్థానిక నాయకులతో సరిగా సమన్వయం చేసుకోవడం లేదని అభిప్రాయం ఉంది. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో సమన్వయ కర్త తలారి రంగయ్య, మాజీ మంత్రి ఉషాశ్రీ చరణ్ వర్గాల మధ్య పోరు ఇప్పటికీ ఉంది. రాయదుర్గం నియోజకవర్గంలో సమన్వయ కర్త మెట్టు గోవింద రెడ్డి, స్థానికంగా పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి వైసిపిని వీడి బిజెపిలోకి చేరినప్పటికీ వైసిపి క్యాడర్ మెట్టు గోవిందరెడ్డి, కాపు రామచంద్రారెడ్డి మధ్య చీలిపోయి బలహీన పడింది. ఆ ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. హిందూపురం అసెంబ్లీలో కూడా ఒకవైపు టిడిపి బలంగా ఉంది. అయినప్పటికీ అక్కడ కూడా వైసిపిలో నేతల మధ్య గ్రూపు తగాదాలు బలం కావడంతో పార్టీ క్యాడర్ వైసిపికి దూరంగా ఉంటున్నాయి. కదిరి అసెంబ్లీ నియోజకవర్గంలో ఏనాడూ రాజకీయాల్లో లేని కొత్త వ్యక్తిని గత ఎన్నికల్లో తీసుకురావడం వల్ల మాజీ ఎమ్మెల్యే సిద్దారెడ్డి వర్గం గత ఎన్నికల్లో పూర్తిగా టిడిపికి చేశారన్న అభిప్రాయం ఉంది. ఈ మధ్య సమన్వయ కర్తగా ఉన్న మక్బుల్ బాషాకు, వైసిపి నాయకులు పూల శ్రీనివాసరెడ్డి మధ్య వార్ నడుస్తుండటంతో వైసిపి క్యాడర్ అసంతృప్తితో ఉంది. ధర్మవరం నియోజకవర్గంలో సమన్వయ కర్త కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కూడా నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలకు ఎక్కువగా అందుబాటులో ఉండటం లేదని అభిప్రాయం ఉంది. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి, టిడిపి నేత పరిటాల శ్రీరామ్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడటం వల్ల అక్కడ కూడా పార్టీ విబేదాలు ఉన్నట్లు కార్యకర్తలు భావిస్తున్నారు. శింగనమల నియోజకవర్గంలో సమన్వయ కర్త డా.సాకే శైలజానాథ్ వర్సెస్ ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి ఎవరి దారిలో వారు వెళ్తుండటంతో వైసిపి క్యాడర్ అక్కడ కూడా అయోమయంలో ఉంది. పుట్టపర్తి సమన్వయ కర్త దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కూడా నియోజకవర్గంలో సరిగా పర్యటించడం లేదని, చుట్టపు చూపుగా వస్తున్నారని, కార్యకర్తలను పట్టించు కోవడం లేదని పార్టీ పరిస్థితి ఆగమ్య గోచరంగా ఉందని అభిప్రాయం లేకపోలేదు. పెనుకొండలో వైసిపి సత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉషాశ్రీ చరణ్, మాజీ ఎమ్మెల్యే శంకర్ నారాయణ మధ్య వర్గ పోరు నడుస్తూనే ఉంది. ఈ విధంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో పలు నియోజకవర్గాల్లో వైసిపి క్యాడర్ గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు బలంగా ఉన్నప్పటికీ తగిన రీతిలో నియోజకవర్గ సమన్వయ కర్తలు స్పందించడం లేదని నియోజకవర్గాల్లో అంతర్గత గ్రూపు రాజకీయాల వల్ల పార్టీ బలోపేతం కావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఆయా నియోజకవర్గాల సమన్వయ కర్తలు పార్టీ క్యాడర్‌కు అండగా నిలవడంతోపాటు కూటమి ప్రభుత్వ వైఫల్యాలను నేతల చర్యలను ఎండగట్టేందుకు ప్రజా స్వామ్య పద్ధతుల్లో పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని వైసిపి కార్యకర్తలు బలంగా అభిప్రాయపడుతున్నారు. ఇదే సమయంలో పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఆయా నియోజకవర్గాల్లో పార్టీ నేతల మధ్య విబేదాలను పరిష్కరించేందుకు, పార్టీలో ఉండి వెన్నుపోటు పొడిచే నాయకులపై కఠిన చర్యలు తీసుకునేందుకు కూడా ముందుకు రావాలని ప్రజలకు సంబంధించిన ప్రధాన సమస్యలపై వైసిపి నాయకులు స్పందించే విధంగా రాష్ట్ర శాఖ చర్యలు తీసుకోవాలని వైసిపి కార్యకర్తలు ఆశిస్తున్నారు.

04ATP15.qxd:04ATP15.qxd 16/06/26 10:38 PM Page 1



# యోగాను జీవన విధానంగా మార్చుకోవాలి...!

## ప్రజలకుమంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపు...! - అతిథులుగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్లు

ధర్మవరం,జూన్ 15, ప్రభాతవార్త

శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. సాయిబాబా కళ్యాణమండపం ఆవరణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మంత్రి సత్యకుమార్ యాదవ్, జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, జిల్లా సంయుక్త కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అతిధులుగా పాల్గొన్నారు.అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "యోగాంధ్ర 2026"లో భాగంగా ధర్మవరంలోని చేనేత (వీవర్స్), వ్యాపార, వాణిజ్య వర్గాల కోసం ప్రత్యేక థీమాటిక్ యోగా కార్యక్రమాన్ని నిర్వహిం చారు.ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ మాట్లాడుతూ... యోగాను ఒక జీవన విధానంగా మార్చుకోవాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. అనారోగ్యం బారిన పడిన తర్వా త ఇబ్బంది పడేకంటే, అసలు వ్యాధులు దరిచేరకుండా చేసేందుకు యోగా ఒక అద్భుతమైన నివారణోపాయంగా ఉపయోగపడుతుం దన్నారు. భవిష్యత్తులో ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం 45 నిమిషాల నుండి గంట పాటు యోగా సాధన చేయాలని కోరారు.ఈ సంవత్సరం పొదుపు చర్యలను పాటిస్తూ, ఖర్చులను తగ్గించుకొని 15 రోజుల పాటు వివిధ వర్గాల (వైద్యు లు, పోలీసులు, కార్మికులు, రైతులు, విద్యార్థులు, వ్యాపారస్తులు మొదలైన వారితో) థీమ్ ఆధారితంగా యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపా రు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆశయమైన ఖిఆరో గ్యాంధ్రప్రదేశ్ఖి నిర్మాణానికి, అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి ఖివికసిత భారత్ఖి సంకల్పానికి యోగా ఎంతో దోహదపడుతుందన్నారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్, వెబ్‌సైట్లలో లభించే యోగా చిట్కాలను చూసి ఇంట్లోనే సులభంగా సాధన చేయవచ్చని పేర్కొం టూ, కార్యక్రమాన్ని విజయ వంతం చేసిన జిల్లా అధికార యంత్రాంగానికి ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ...మన చుట్టూ ఉన్న పర్యావరణం, జంతువుల కదలికలను పరిశీలించి మన రుషులు మకరాసనం, మర్కటా సనం, మార్జా లాసనం, ఉష్ట్రాసనం, శశాంకాసనం, వృక్షాసనం వంటి వివిధ యోగాసనాలను రూపొందించారని, ప్రకృతితో మమేకం కావడానికి యోగా ఎంతో దోహద పడుతుందని కలెక్టర్ తెలిపారు.కేవలం 15 నిమిషాల యోగా సాధనతోనే శరీరంలో రక్తప్రసరణ మెరుగవుతుందని, ప్రాణవాయువు అంది శరీరం ఉత్తేజితం, ప్రశాంతతను పొందుతుందని వివరించారు. ఈ శారీరక సౌకర్యం, ఆనందం డబ్బులు ఇస్తే లభించేవి కావని, నిరంతర సాధనతోనే సాధ్యమన్నారు.ప్రభుత్వం ఆయుష్ శాఖ ద్వారా ఉచిత లింకులను అందిస్తూ ఆన్‌లైన్ క్లాసుల ద్వారా కోట్లాది మందికి యోగాను చేరువ చేస్తోందని, తాను కూడా ఆన్‌లైన్ ద్వారానే యోగాను ఫాలో అవుతున్నానని కలెక్టర్ వెల్లడించారు. ప్రతి ఒక్కరిలో సంకల్పం పెరిగినప్పుడే ఆసుపత్రులకు వెళ్లే వారి సంఖ్య తగ్గి దేశ ఆరోగ్యం మెరుగవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ, రోజుకు కనీసం అరగంట పాటు యోగా చేస్తామని ప్రతిజ్ఞ పూనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ధర్మవరం ఇన్‌చార్జ్ ఆర్డీఓ సువర్ణ, ధర్మవరం మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య,డిఆర్‌డిఏ పిడి నరసయ్య, జిల్లా అధికారులు ,పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని యోగాసనాలు వేశారు.



యోగాసానాలు చేస్తున్న మంత్రి, కలెక్టర్

# అభివృద్ధి కోసం పరిశ్రమలకు భూమి ఇచ్చిన రైతులందరూ నిజమైన దేశభక్తులతో సమానం... ఎమ్మెల్యే,మాజీ ఎమ్మెల్సీ

## భూ బాధితులకే పరిశ్రమల్లో ఉపాధికి తొలి ప్రాధాన్యత - తెదేపా జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు రైతులకు హామీ

మడకశిర టౌన్ జూన్ 15 ప్రభాతవార్త

మడకశిర నియోజకవర్గ అభివృద్ధి కోసం రైతులు తమ భూములను త్యాగం చేసి రైతులు తమ భూములను పరిశ్రమలకు ఇచ్చిన రైతులందరూ నిజమైన దేశభక్తులతో సమానం అని ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు తెలిపారు.మడకశిర మండల పరిధిలోని ఆర్, అనంతపురం గ్రామ సమీపంలో ఉన్నటువంటి రైతుల భూములను 2003 లో పరిశ్రమల ఏర్పాటుకు భూములు కోల్పోయిన నిర్వాసితులకు భూబాధితులు కుటుంబాలకు ఉపాధి కల్పనలో మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి లు బాధిత రైతులకు స్పష్టమైన హామీ ఇచ్చారు. సోమవారం పట్టణంలోనికి స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో సోమవారం మరొకసారి మండలంలోని ఆర్ అనం తపురం గ్రామంలో ఉన్నటువంటి రైతుల భూములు 2,000 సంవత్సరంలో లెదర్ ఫ్యాక్టరీ కోసం భూములు కోల్పోయిన 41 మంది బాధిత రైతులకు నష్టపరిహారంగా రూ.1.18కోట్లు విలువైన మెగా చెక్కును ఎమ్మెల్యే ఏం ఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ శ్రీనివాస మూర్తి ల చేతులమీదుగా పంపిణీ చేశారు. ఎమ్మెల్యే రాజు,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి లు మాట్లాడుతూ: గత 20 ఏళ్ల క్రితం భూములు కోల్పోయిన రైతులు గతంలో ఎన్ని ప్రభుత్వాల మారిన పరిశ్రమలకు భూములు ఇచ్చిన రైతులకు పరిహారం మాత్రం ఇవ్వలేదని బాధిత రైతులు నా వద్ద మొర పెట్టుకున్నారని అన్నారు. ఈ విషయమై విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో రైతుల సమ స్యను వివరించగా వెంటనే స్పం దించిన ఆయన ఏపీఐఐసి శాఖ ద్వారా బాధిత రైతులకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారని అన్నారు. 20 ఏళ్లుగా నిరీక్షిస్తున్న రైతులకు మా చేతుల మీదుగా పరిహారం చెక్కు లను అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. గతంలో ఈ నియోజకవర్గంలో గతంలో ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా పనిచేసిన రైతులను విస్మరించారని ఎన్నిసార్లు బాధిత రైతులు నిరసన కార్యక్రమాలు చేపట్టిన న్యాయం జరగలేదన్నారు. అప్పట్లోనే రైతులకు పరిహారం అందించి ఉంటే వారి అభివృద్ధికి ఎంతో దోహదపడేది అన్నారు. ప్రస్తుతం మడకశిర మండల ంలో ఏర్పాటు కాబోయే పరిశ్రమల్లో భూము లను కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు చెందిన అర్హులైన వ్యక్తులకు సంస్థల్లో మొదటి ప్రాధాన్యత దక్కుతుంది. భూములు కోల్పోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. పరిశ్రమలకు భూములు ఇచ్చిన రైతులు దేశ భక్తులతో సమానమని తెలిపారు. భూములు ఇచ్చిన రైతులకు నా శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు 1, 18 లక్షల 95 వేల రూపాయలు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి.

# లారీని ఢీకొని ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదంలో మృతి

మడకశిర టౌన్ జూన్ 15 ప్రభాతవార్త

మడకశిర నియోజకవర్గం, మడకశిర మండలం, తడకలపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో క్యాంపురం, గుండుమల గ్రామాలకు చెందిన ముగ్గురు యువకులు మహీంద్ర, ఆదిమూర్తి, త్రిలోక్ ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక శాసనసభ్యులు, టీటీడీ పాలక మండలి సభ్యులు, సత్యసాయిజిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు బాధిత కుటుంబాలను మడకశిర ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వెళ్లి పరామర్శించారు. మృతి చెందిన యువకుల పార్థీవదేహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శోకాతప్తహృదయాలతో ఉన్న యువకుల కుటుంబాలను ఓదార్చారు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువకులు రెప్పపాటులో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం పట్ల ఎం.ఎస్.రాజు తీవ్ర విచారం వ్యక్తం చేసి, బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు. ముగ్గురు యువకుల కుటుంబాలకు అంత్యక్రియల నిమిత్తం ఒక్కో కుటుంబానికి రూ.20వేలు చొప్పున ఆర్థికసాయం అందించి బాసటగా నిలిచారు. అదేవిధంగా అయ్య వారిపల్లి వద్ద జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న సుధాకర్ ను సోమవారం మడకశిర ప్రభు త్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి లు పరామర్శించారు. అతనికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎం. ఎస్.రాజు బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ: యువత, ప్రజలు వాహనాలు నడిపేవారు రోడ్డు భద్రతా నియమాలకు అనుగుణంగా ప్రయా ణాలు చేయాలని సూచించారు. ప్రాణం చాలా విలువైందని ఒక వ్యక్తి చనిపోతే ఆ కుటుంబం ఎదుర్కొనే బాధలు, మానసిక వేదన, ఇబ్బందులు వర్ణనాతీతం అని వివరించారు.



బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

# ధర్మవరంలోజాతీయస్థాయి హాకీ టోర్నీనిర్వహించేలా తోడ్పాటు అందిస్తాం

## మంత్రిసత్యకుమార్ యాదవ్ - రాష్టస్థాయి హాకీ టోర్నీజాయింట్ విన్నర్స్ అనకాపల్లి,అన్నమయ్యజట్లు

ధర్మవరం, జూన్ 15, ప్రభాతవార్త

హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ధర్మవరం ప్రభుత్వబాలుర ఉన్న తపాఠశాల క్రీడామైదానంలో సోమవారం జరిగిన " ధర్మాంబ అథ్లెటిక్స్ అసోసియేషన్" 75 సంవత్సరాల వజ్రోత్సవాలలో భాగంగా 16వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల హాకీ టోర్నీలో జాయింట్ విన్నర్స్ అనకాపల్లి, అన్న మయ్యజట్లు విజేతలుగా నిలిచాయి. వర్షాభావం కారణంగా ముందు స్కోర్ను బట్టి అనకాపల్లి, అన్నమయ్యజట్లను జాయింట్ విన్నర్స్ గా ప్రకటించినట్టు సత్యసాయిజిల్లా హాకీ అసోషియేషన్ ఉపాధ్యక్షులు బంధనాధం సూర్యప్రకాశ్ తెలిపారు. అదేవిధంగా మూడవస్థానంలో అనంతపురం జట్టును ప్రకటించారు. వీరికి షీల్డ్, ప్రశంశాపత్రాలను మంత్రి చేతులమీదుగా అందజేశారు.

అదేవిధంగా అనకాపల్లికి చెందిన హర్షకమల్, సత్యసాయి జిల్లాకు చెందిన రఫీ, అన్నమయ్యజిల్లాకు చెందిన హితేశ్ కు బెస్టెయర్గా మంత్రి చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ..... క్రీడలతో మానసిక ఉల్లాసాన్ని కల్గి సాయన్నారు. క్రీడల వల్ల ఎంతో మంది ఉన్నతస్థాయిలో స్థిర్ణబడ్డారన్నారు. హాకీ క్రీడలో అంతర్జాతీయ, జాతీయస్థాయిలో రాణిం చాలని మంత్రి క్రీడాకారులకు సూచిం చారు.త్వరలో ధర్మవరంలో టర్ఫ్ కోర్టును ఏర్పా టుచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో హాకీ ఆంధ్రప్ర దేశ్ రాష్ట్ర అధ్యక్షులు చాణు క్యరాజు, రాష్ట్ర కోశాధికారి థామ స్పీటర్,. జిల్లా ప్రధానకార్యదర్శి బంధ నాధం సూర్యప్రకాశ్,ధర్మాంబ అథ్లెటి క్స్ అసోషియేషన్ గౌరవాధ్యక్షులు పల్లెం వేణుగో పాల్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జయశ్రీ, జిల్లా ఉపాధ్యక్షులు గౌరీప్రసాద్, ఉడుములరామచంద్ర, ఊకా రాఘవేంద్ర, మహమ్మద్ ఇస్లాం, జిల్లా కోశాధికారి అంజన్న, జిల్లా జాయింట్ సెక్రటరీలు అరవింద్ గౌడ్, జిన్నే చందు. డైరెక్టర్లు మారుతిప్రసాద్, ఇర్షాద్, అమునుద్దీన్, కిరణ్, కోచ్ హుస్సేన్లు పాల్గొన్నారు.



జాయింట్ విన్నర్స్ కు బహుమతులను అందజేస్తున్న మంత్రిసత్యకుమార్,తదితరులు



మూడవ బహుమతి అందుకుంటున్న అనంతపురంజట్టు.

# దివ్యాంగ పిల్లలు భగవంతుని ప్రతినిధులు...!

## దివ్యాంగుల ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్.

ధర్మవరం, జూన్ 15,ప్రభాతవార్త

ధర్మవరం పట్టణంలోని ఎల్.సి.కె పురం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన దివ్యాంగులకు ఉచిత సహాయక ఉపకరణాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డితో కలిసి రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖామంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ పాల్గొని లబ్ధిదారులకు వీల్‌చైర్లు, హియరింగ్ ఎయిడ్స్, సీపీ చైర్లు, రోలేటర్లు, బ్రెయిలీ స్లేట్లు, ట్రైసైకిళ్లు, లెర్నింగ్ కిట్లు తదితర ఉపకరణాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ... దివ్యాంగ పిల్లల గురించి మన సమా జం మరింత సున్నితంగా ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. మనిషికి ఎన్నో కోరికలు, ఆశలు, ఆలోచనలు ఉంటాయి. కానీ దివ్యాంగ పిల్లల మన సు మాత్రం అత్యంత స్వచ్ఛ మైనది. ఎవరికైనా అన్యాయం చేయాలి, మోసం చేయాలి, కుట్ర చేయాలి అనే ఆలోచనలు వారికి ఉండవు. అందుకే భగవంతుడు ఈ పిల్లలను తన ప్రతిని ధుల్లా సమాజంలోకి పంపాడేమో అనిపిస్తుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దివ్యాంగుల పట్ల చూపిన గౌరవాన్ని మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. గతంలో వికలాంగులు అని పిలిచేవారని, కానీ ప్రధానమంత్రి మోదీ వారిని దివ్యాంగులు అని సంబోధించి వారికి గౌరవప్రదమైన గుర్తింపును ఇచ్చారని అన్నారు. అది కేవలం పదబంధ మార్పు మా త్రమే కాకుండా, ప్రభుత్వ ఆలోచ నలో వచ్చిన గొప్ప మార్పుకు సంకేతమని వివరించారు. దివ్యాంగుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు గణనీయంగా పెరిగాయని మంత్రి తెలిపా రు. 201314లో రూ.338 కోట్లుగా ఉన్న బడ్జెట్, 202526 నాటికి రూ.1750 కోట్లకు పెరిగింది అని చెప్పారు. అంటే దాదాపు రూ.1400 కోట్ల కు పైగా అదనంగా దివ్యాంగుల శ్రేయస్సు కోసం కేటా యించబడిందన్నారు. తిలిలీదివీ (ఆర్టిఫిషల్ లింబ్స్ మణుఖ్ఫు రింగ్ కార్పొరేషన్ అఫ్ ఇండియా ) ద్వారా అనేక రకాల సహాయక ఉపకరణాలు అందిస్తున్నట్టు మంత్రి వివరిం చారు. శారీరక, మానసిక ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు వీల్ చైర్లు, హియ రింగ్ ఎయిడ్స్, సీపీ చైర్లు, రోలే టర్లు, క్రచెస్, బ్రెయిలీ స్లేట్లు, లెర్నింగ్ కిట్లు, ఫోల్డి ంగ్ వాకర్స్ వంటి ఉప కరణాలు అందించడం ద్వారా వారి జీవన నాణ్యత మెరుగుపడుతోందన్నారు. సమగ్ర శిక్ష - శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో ఈ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో ది్రశివి (చిల్డ్రన్ విత్ స్పెషల్ నీడ్స్ ) పిల్లలకు ఏడిఐపి పథకం కింద ఉపకరణాలు అందిస్తున్నారన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో 508 మంది లబ్ధి దారులకు ఈ కార్యక్రమం కింద ఉపకరణాలు అందజేస్తున్నట్టు వెల్లడించారు.ధర్మవరం నియోజకవర్గానికి ప్రత్యేకంగా వచ్చిన ఉపకరణాలు వీల్ చైర్లు 31, హియరింగ్ ఎయిడ్స్11, సీపీ చైర్లు 21, రోలేటర్లు 8, బ్రెయిలీ స్లేట్లు 4, ట్రైసైకిళ్లు 2, లెర్నింగ్ కిట్లు 81, ఫోల్డింగ్ వాకర్స్ 3, మొత్తం 161 ఉపకరణాలు ధర్మవరం నియోజకవర్గానికి అందాయని మంత్రి తెలిపారు. మండలాల వారీగా లబ్ధిదారుల వివరాలు కూడా మంత్రి వెల్లడించారు: ధర్మవరం - 42 మంది లబ్ధిదారులు, 58 ఉపకరణాలు, బత్తలపల్లి, తాడిమర్రి, మొత్తం 134 మంది లబ్ధిదారులకు 161 ఉపకరణాలు అందజేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, ఐఇడి కోఆర్డినేటర్ పుల్లన్న, ఎంఈవోలు రాజేశ్వరి, గోపాల్ నాయక్, ఎన్డీఏ కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఉపకరణాలు అందిస్తున్న మంత్రి

# జిల్లా ఎస్పి గ్రీవెన్స్ కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా వేసిన జె.సి ప్రభాకర్‌రెడ్డి

## - ప్రభుత్వ పెద్దల నుంచి స్పష్టమైన హామీ లభించిందని వెల్లడి

తాడిపత్రిఅర్బన్, జూన్ 15 ప్రభాతవార్త

తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డి అనంతపురం జిల్లా కేంద్రంలో ఉన్న ఎస్‌పి కార్యాలయం వద్దకు పెద్దారెడ్డి బాధితులతో కలిసి దాదాపు 100 వాహనాలతో వెళ్లడానికి సిద్ధం కాగా ప్రభుత్వ పెద్దలు చర్చలు సఫలమై వాయిదా వేయడంతో అటు పోలీసులు, ఇటు ప్రభుత్వ పెద్దలు ఊపిరి పీలు చుకున్నారు. ప్రభుత్వ పెద్దలు, పోలీస్ అధికారులు చర్చించిన తరువాత సోమవారం అనంతపురం కార్యాలయంలో గ్రీవెన్స్ లో ఇవ్వాల్సిన వినతి కార్యక్రమం రద్దు చేసినట్లు మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అనం తపురం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్, అనంతపురం తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పూలనాగరాజులు సోమవారం జె.సి ప్రభాకర్‌రెడ్డిని ఆయన స్వగృహంలో కలిసి సుదీర్ఘంగా చర్చించారు. తాడి పత్రిలో నెలకొన్న పలు సమస్యలు, వైఎస్ఆర్‌సిపి అధికారంలో ఉన్నప్పుడు టిడిపి నాయకులు, కార్యకర్తలపై పెట్టిన కేసులు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల మీద పెట్టిన రౌడీ షీట్ల తొలగింపు గురించి పరిష్కారం చూపాలని జె.సి ప్రభాక ర్‌రెడ్డి వారిని కోరారు. అదే విధంగా ఇటీవల కాలంలో అనంతపురం జిల్లాలో వైఎస్ ఆర్‌సి పికి చెందిన వారు చేస్తున్న దౌర్జన్యాలు దాదులు సమంజసం కాదని వీరి ఆగడాలకు తక్షణం అడ్డుకట్ట వేసి తెలుగు దేశం పార్టీ కార్యకర్తలకు ఆత్మస్థైర్యం పెరిగేలా చేయాలని జె.సి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. జె.సి ప్రభాకర్‌రెడ్డి తమతో చర్చించిన విషయాలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళతానని సమస్యల పరిష్కారానికి కేసులు ఎత్తివేయడానికి సమయం కావాల్సి ఉంటుందని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నట్లు సమా చార ం. చర్చలు ముగిసిన తరువాత జె.సి ప్రభాకర్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసి న విందును ఆరగించి మంత్రి టీజీ భరత్ విజయవాడకు పయనమయ్యారు.



మంత్రి టిజి భరత్‌తో మాట్లాడుతున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి



విందులో పాల్గొన్న మంత్రి టిజి భరత్

# ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు పండించుకోవచ్చు..

## పెట్టుబడి తక్కువ,భూమి సారవంతం - జిల్లాస్థాయి ప్రకృతి వ్యవసాయ సదస్సులో పలువురు వక్తలు

బత్తలపల్లి, జూన్ 15 ప్రభాతవార్త

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు పండించుకోవచ్చునని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని సంజీవపురం సమీపాన కాటి కోటేశ్వర క్షేత్రంలోని టిటిడి కళ్యాణ మండపంలో బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ముల్లగూరు సురేంద్రనాయుడు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ప్రకృతి వ్యవసాయ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం. శేఖర్,బిజెపి రాష్ట్ర కార్యదర్శి సంధిరెడ్డి శ్రీనివాసులు ,ప్రకృతి వ్యవసాయ సదస్సు ఇంచార్జ్,బిజెపి నేషనల్ కౌన్సిల్ మెంబర్ విష్ణువర్ధన్ రెడ్డి,సీనియర్ నాయకులు హార్టికల్చర్ రాష్ట్ర కన్వీనర్ సామాల కేశవరెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చింత శరత్ కుమార్ రెడ్డి,కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సోమల ప్రకాష్ నాయు డు,సత్యసాయి జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రామసుబ్బయ్య, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మానాయక్, ప్రకృతి వ్యవసాయం దక్షిణ భారత వ్యవసాయ నిపుణులు బసంపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు వ్యవసాయంలో అధిక స్థాయిలో రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించడం వల్ల సమాజంలో బీపీ,షుగర్,క్యాన్సర్ వంటి అనేక అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రకృతి వ్యవసాయం శ్రేయస్కరమని రైతులు రసాయన రహిత వ్యవసాయం వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. రసాయన ఎరు వులతో కాకుండా ప్రకృతి సిద్ధంగా లభించే జీవామృతంతో పంటలు సాగు చేస్తే భూమిలో సూక్ష్మజీవుల సంఖ్య వానపాములతో భూమి సారవంతంగా తయారవుతుందన్నారు.విత్తనం మొదలుకొని పంట దిగుబడి చేతికి దక్కే వరకు ప్రకృతి సిద్ధంగా లభించే వాటితోనే అధిక దిగుబడులు సాధించ వచ్చునన్నారు.దేశప్రధానమంత్రి నరేంద్రమో దీ 12 సంవత్సరాల సుపరి పాలనను పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు బిజెపి నేతలు పేర్కొ న్నారు.ఈ సదస్సులలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు పాల్గొని రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు,సేంద్రీయ సాగు విధానాలు, తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందే మార్గాలపై సూచనలు, సలహాలు అంద జేస్తున్నట్లు పేర్కొన్నారు.జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని మరింతగా విస్తరించేందుకు అవసరమైన పలు తీర్మానాలు చేశారు.జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. సదస్సుకు ముందు మేలు జాతి పశువులను ప్రదర్శించారు. జిల్లా సదస్సుకు హాజరైన రైతులు,రైతు కూలీలు,వ్యవసాయ అనుబం ధరంగాల వారికి కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ముళ్లగూరు సురేంద్రనాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల రాష్ట్ర కోకన్వీనర్ ఎస్. హనుమతరెడ్డి , జిల్లా ప్రధాన కార్యదర్శి ముళ్ళగూరు సురేంద్రనాయుడు, తాడిమర్రి మండల అధ్యక్షులు వెంకట నాయుడు,గోపాల్ రెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు సూరి, రమణ మండల బీజేపీ ఉపాధ్యక్షులు వడ్డే తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ జిల్లా సదస్సులో మాట్లాడుతున్న సంధి రెడ్డి శ్రీనివాసులు



సదస్సులో మేలు జాతి పశువులను ప్రదర్శిస్తున్న రైతులు

# కూటమి ప్రభుత్వంతోనే రాయదుర్గం అభివృద్ధి...ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గం, జూన్ 15 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వంతోనే రాయదుర్గం అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాల కాలంలో పట్టణ అభివృద్ధి కోసం దాదాపు రూ.13 కోట్ల నిధులను ప్రత్యేకంగా సమీకరించి పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. రాయదుర్గం పట్టణంలోని 11వ వార్డు పరిధిలో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో రూ.60 లక్షల వ్యయంతో సుమారు 15 సిమెంట్ రోడ్డు పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉన్నా, మున్సి పాలిటీకి సొంత ఆదాయంతో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం లేకపోయినా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక సహకారంతో ప్రభుత్వం నిధులను సమకూరుస్తోందన్నారు. ముఖ్యమంత్రి నేమకల్లు పర్యటన సందర్భంగా రాయదుర్గం మున్సిపాలిటీ ఆర్థిక పరిస్థితిని వివరించగా, రాబోయే ఐదేళ్లలో రూ.50 కోట్ల మేర నిధులు అందజేస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆ హామీ మేరకు ఇప్పటికే వివిధ రూపాల్లో రూ.13కోట్ల నిధులు అందాయన్నారు. త్వరలో నిలిచిపోయిన రైల్వే వంతెన నిర్మాణ పనులను కూడా ప్రారంభిస్తామన్నారు. వచ్చే మూడు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే రాయదుర్గం పట్టణంలో ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు అందించే లక్ష్యంతో రూ.78 కోట్లతో అమృత్ 2 పథకాన్ని ఇటీవల ప్రారంభించామన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలన్నీ పూర్త యితే రాయదుర్గంలో దాదాపు రూ.140 కోట్ల విలువైన అభివృద్ధి పనులు అమలైనట్లు అవుతుందని వివరించా రు. వీటితోపాటు భవి ష్యత్తులో మరిన్ని నిధులు తీసుకు వచ్చి రాయ దుర్గం పట్టణాన్ని రాష్ట్రంలో ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. రాయదుర్గం పట్టణ ప్రజలు తనకు 16 వేల మెజార్టీ ఇచ్చారని, వారి రుణం తీర్చుకోవడం కోసం అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగించి మరింత అభివృద్ధి సాధి స్తామని ఎమ్మెల్యే కాలవ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, మాజీ కౌన్సిలర్లు బండి భారతి, కురుబ ప్రశాంతి, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పోరాళ్ల పురుషోత్తం, మాజీ చేనేత కార్పొరేషన్ డైరెక్టర్ నటకశాల హనుమంతు, పూజారి శివ,దబ్బిడి శివ, సుమలత,గుద్దిటి లోకేష్,రావుత్ రాజశేకర్,ఏళ్లప్ప, ఆటో మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



సిమెంట్ రోడ్డు కి భూమా పూజ చేస్తున్న ఎమ్మెల్యే

# ఎన్డీఏ కూటమి 2 ఏళ్ల పాలన పై జరిగే సభను విజయవంతం చేయండి

## హిందూపురం పార్లమెంట్ సభ్యులు బి.కే పార్థసారథి

పెనుకొండ జూన్ 15 ప్రభాతవార్త

ఎన్డీఏ కూటమి పాలన విజయవంతంగా 2ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం జిల్లాస్థాయిలో పుట్టపర్తిలో నిర్వహించే సభను టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, పెద్ద ఎత్తున పాల్గొని విజయ వంతం చేయాలని హిందూపురం పార్లమెంట్ సభ్యులు బి.కే పార్థసా రథి పిలుపునిచ్చారు. సోమవారం పెనుకొండ పట్టణంలోని పార్లమెంట్ సభ్యుల కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటం ప్రభుత్వం రెండు సంవత్సరములు విజయవంతంగా పాలన పూర్తి చేసి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని సంక్షేమాన్ని ప్రజలకు తెలియజేయాలని ఉద్దేశంతో తిరుపతిలో బహిరంగ సభ నిర్వహించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో ఈరోజు జరిగే సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ ఐదు సంవత్సరములు అభివృద్ధి గురించి మరిచిపోయి ప్రజలు ప్రతిపక్షంలో కూర్చోబెట్టిన తర్వాత కూటమి ప్రభుత్వం విజయోత్సవ సభ నిర్వహిస్తుంటే అదేరోజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెన్నుపోటు దినోత్సవం అంటూ కార్యక్రమాలు నిర్వహించడం సిగ్గుచేటని ఆయన తెలిపారు. కూటం ప్రభుత్వ పాలనలో పారిశ్రామికవేత్తలు ఆంధ్రప్రదేశ్లో పెట్టుబడులు పెట్టడానికి వరుస కడుతున్నా రంటే అందుకు కారణం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన మీద ఉన్న నమ్మకమేనని ఆయన తెలిపారు. వైసిపి నాయకులు ఇలానే ప్రవర్తిస్తే వచ్చే ఎన్నికలలో సింగిల్ డిజిట్ కూడా ఉండద న్నారు.టిడిపి కార్యకర్త వడ్డే శీనను పరామ ర్శించిన ఎంపీ బీ.కే పార్థసారది: పెను కొండ పట్టణం సిఫారానికి చెందిన వడ్డే శ్రీనా కు ఇటీవల యాక్సిడెంట్ జరిగి ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంట్లో విశ్రాంతి తీసుకుం టుండగా సీనా ఇంటికి హిందూపురం పార్లమె ంట్ సభ్యులు బి.కె పార్థసారథి, కుమారుడు యువ నాయకుడు బి.కె సాయికళ్యాణ్, మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, రమేష్ నాయుడు, ప్రసాద్ శివ, నాయకులు తదితరులు వెళ్లి పరామర్శించారు.



మాట్లాడుతున్న ఎంపీ బీ.కే పార్థసారథి

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయం

మడకశిర టౌన్ జూన్ 15 ప్రభాతవార్త

రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే రాజు,మాజీ ఎమ్మెల్సీ గుండుమలకుట్టేసామి తెలిపారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయ గోదాములో రైతులకు వేరు శనగ విత్తన కాయల బస్తాలను జిల్లా అధ్యక్షులు, టిటిడి బోర్డు మెంబర్, ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఎంపిక చేసిన రైతులకు కూటమి ప్రభుత్వం రాయితీ పై అందించిన వేరుసెనగ విత్తన కాయలు పంపిణీ ప్రశాం తంగా నిర్వహించారు. ఎమ్మెల్యే రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదేశాల నియోజకవర్గంలో ఐదు మండలాలో పలు పంచాయతీలందు వేరుశెనక్కాయలు పంపిణీ కార్యక్ర మాలను తెలుగుదేశం పార్టీ శ్రేణులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు మాట్లాడుతు:రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యా ణ్, విద్యా శాఖమంత్రి నారా లోకేష్ బాబులు. ముందు చూపుతో సీజన్ ప్రారంభంలో రైతులకు రాయితీ వేరు శనగ విత్తన కాయలను అందించడం అభినందనీయమన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా లాభపడాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో, తిమ్మప్ప. మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి, మాజీ మున్సిపల్ చైర్మన్ నం సింహ రాజు, ఏపీఐసీసీ డైరెక్టర్ రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు నాగే ంద్ర, ఐదు మండలాల కన్వీనర్లు, మాజీ కౌన్సిలర్లు ఉమాశంకర్, విక్రమ్, వెంకట లక్ష్మమ్మ,నాయకులు కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.



వేరుశెనగ విత్తనకాయలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి